ప్రజాశక్తి

శనివారం 27 డిసెంబర్ 2025 8 పేజీలు





గుంటూరు

పల్నాడు

నిర్బంధ భూసేకరణకు

తీర్మానం ఆమోదం కోసం నేడు గుంటూరు కౌన్సిల్‌లో చర్చ



బ్రిడ్జి పనులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణం కోసం దాదాపు 43 మంది వ్యాపారుల నుంచి సంబంధిత స్థలాలను భూ సేకరణ ద్వారా స్వాధీనం చేసుకునేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మున్సిపల్ పరిపాలన శాఖ ద్వారా రెవెన్యూ అధికారులు భూసేకరణ చేసి సంబంధిత భూములను రహదారులు, భవనాల శాఖకు అప్పగించేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనిపై శనివారం జరిగే నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించి రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్‌కు నివేదిక పంపుతారు. డైరెక్టర్ మున్సిపల్ పరిపాలన శాఖ అనుమతితో భూసేకరణకు రెవెన్యూ అధికారులు నోటిఫికేషన్ జారీ చేస్తారు. జారీ తరువాత 30 రోజుల్లో అభ్యంతరాలు స్వీకరించాలి. వాటిని పరిష్కరించి భూములను 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది.

అయితే గుంటూరు నగర నడిబొడ్డున ఉన్న తమ స్థలాలు అత్యంత విలువ కలిగినవని, వీటిని ప్రభుత్వం నిర్ధేశించిన ధరకు ఇవ్వలేమని వ్యాపారులు చెబుతున్నారు. అంతేగాక తమ వ్యాపారాలకు ఇబ్బంది లేకుండా బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలని కోరినా వినకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడంపై వ్యాపారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో భూములివ్వని 43 మంది నుంచి నిర్బంధంగానే భూములు తీసుకోవాలని జిల్లా అధికారులు నిర్ణయించారు. ఇందుకు చర్యలు వేగంగా చేపట్టాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఇటీవల సమీక్షలో అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఈ అంశాన్ని శనివారం జరిగే కౌన్సిల్ సమావేశంలో చర్చించి ప్రభుత్వానికి తీర్మానం పంపేందుకు కమిషనర్, మేయర్ వ్యూహరచన చేస్తున్నారు.

వివిధ వార్డుల్లో 4337 ఆస్తులకు సంబంధించిన ఆస్తి పన్ను రూ.33.62 కోట్ల రద్దుకు ప్రతిపాదనలు కౌన్సిల్ ఆమోదం కోసం పంపారు. ఒకే ఇంటికి రెండు పన్నులు, ఆస్తి లేకుండా ఉన్నట్లు పన్ను విధించడం, ఇల్లు పడిపోవడం, భవనం తొలగించి అపార్టుమెంట్ నిర్మించగా అపార్టుమెంట్‌కు పన్ను విధించి పాత ఇంటికి కొనసాగించడం, రోడ్డు విస్తరణలో ఇళ్ల తొలగించినా పన్నులు కొనసాగించడం వంటి చర్యల వల్ల అర్హత లేకుండా కార్పొరేషన్ అధికారులు వసూలు చేస్తున్న ఆస్తి పన్నులు రూ.33.62 కోట్లు రద్దుకు ప్రియాంబుల్స్ కౌన్సిల్ ముందుంచారు. వర్షం నీరు బయటకు పోయేందుకు వీలుగా పనులు చేపట్టేందుకు డిపిఆర్ తయారీకి టెండర్లను ఖరారు చేయనున్నారు. మానస సరోవరం పార్కును అభివృద్ధి వివిధ పనుల కింద నిధుల కేటాయింపునకు కౌన్సిల్‌లో ప్రతిపాదనలు సిద్ధం చేశారు.



మాట్లాడుతున్న వై.నేతాజి

ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు తీర్మానం

ప్రజాశక్తి-గుంటూరు

గ్రామీణ పేదల ఉపాధికి గ్యారంటీ కల్పించే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తొలగిస్తూ కేంద్రం జీ రాంజీ పేరుతో తెచ్చిన కొత్త చట్టాన్ని రద్దు చేయాలని వివిధ రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయి. ఎంజిఎన్ఆర్ఇజిఎస్ చట్టాన్ని పునరుద్ధరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం బ్రాడీపేటలోని ఆ పార్టీ కార్యాలయంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కాంగ్రెస్, వివిధ వామపక్ష పార్టీలు, బిఎస్‌పి, జెడియు, విసికె పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్రం ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి, జీవించే హక్కులో భాగమైన ఉపాధి హక్కును కాలరాస్తోందన్నారు. యుపిఎ-1 హయాంలో వామపక్ష పార్టీల ఒత్తిడి మేరకు ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టం, విద్యాహక్కు చట్టం, సమాచార హక్కు చట్టం వంటి ముఖ్యమైన చట్టాలు వచ్చాయన్నారు. ముఖ్యంగా ఉపాధి హామీ చట్టం గ్రామీణ వలసలను కొంతమేర అరికట్టిందని, పేదలకు ఆర్థిక భరోసా కల్పించిందని, మౌలిక సదుపాయాలు కల్పన జరిగిందని చెప్పారు. మోడీ ప్రభుత్వం ఈ చట్టాన్ని క్రమంగా నీరుగార్చుతోందన్నారు. పాతచట్టంలో డిమాండ్ ఆధారంగా పని కల్పిస్తారని, కొత్త చట్టంలో కేంద్రం ఇచ్చే నిధులను బట్టి పని దొరుకుతుందని తెలిపారు. కేంద్రం ఇచ్చే నిధులను 90 శాతం నుండి 60 శాతానికి తగ్గించుకుందని, మిగిలిన వాటిని రాష్ట్రాలపై భారం మోపిందని, 2లో



కొనుగోలు కేంద్రం ఎదుట రాస్తారోకో చేస్తున్న పత్తిరైతులు

పత్తిరైతు రాస్తారోకో

సాకులు వీడి పంట కొనుగోలుకు అంగీకారం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

సాకులతో తిరస్కరించిన తమ పత్తిని కొనాల్సిందేనని రైతులు రాస్తారోకోకు దిగాల్సి వచ్చింది. అమరావతి మండలంలోని అత్తలూరు, మల్లాది తదితర గ్రామాలకు చెందిన పత్తిరైతులు శుక్రవారం తమ పంటను తీసుకుని ప్రత్తిపాడులోని సహజనంద కాటన్స్ వద్ద కొనుగోలు కేంద్రానికి వచ్చారు. పంటను పరిశీలించిన సిసిఐకి చెందిన ఫీల్ ఆఫీసర్ నవీన్... కాయ తగులుతోందంటూ కొనడానికి 2లో

ధర తగ్గించుకోవాలని బతిమాలినా వినలేదు

వెంకటేశ్వరావు, రైతు, అమరావతి మండలం

20 ఎకరాల్లో పత్తి వేస్తే 200 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అమ్ముకోవడానికి తీసుకొస్తే బాగోలేదంటూ కొనడానికి నిరాకరించారు. రూ.100 తగ్గించి అయినా తీసుకోవాలని బతిమాలినా వినిపించుకోలేదు. దూరాబారం నుండి రెండు లారీల్లో పంటను తెచ్చాను. లారీకి రూ.20 వేల ఖర్చయింది. పంటను తిరిగి తీసుకెళ్తే మళ్లీ రూ.20 వేలు కట్టాల్సి వస్తుంది. నానా కష్టాలు పడి పంట పండించిన మేము ఇప్పుడేం చేయాలి.



వినుకొండలో మాట్లాడుతున్న ఆంజనేయులు నాయక్

ఎన్నడూ లేనంతగా కష్టాల్లో కార్మికులు

- సిఐటియు జాతీయ మహాసభలో ప్రత్యామ్నాయ విధానాల రూపకల్పన
- జయప్రదం కోసం పల్నాడు జిల్లా వ్యాప్తంగా ప్రచారజాతా

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్వాతంత్ర్యానంతరం ఎన్నడూ లేనంతగా కార్మిక వర్గం తీవ్రమైన కష్టాలను ఎదుర్కొంటోందని, కార్పొరేట్లకు కొమ్ముగాస్తున్న కేంద్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను పూర్తిగా హరిస్తున్నాయని సిఐటియు రాష్ట్ర నాయకులు గుంటూరు విజయ్‌కుమార్ అన్నారు. ఈనెల 31 నుండి వచ్చేనెల 4 వరకు విశాఖలో జరిగే సిఐటియు అఖిల భారత మహాసభ, 4న ర్యాలీ, బహిరంగ సభ జయప్రదం కోసం జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ప్రచార జాతా చేపట్టారు. జాతాను నరసరావుపేట మున్సిపల్ కార్యాలయం వద్ద విజయ్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. కార్మికులు సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించపోగా కొత్త సమస్యలు తెస్తున్నాయని, ఉద్యమాలను అణచాలని చూస్తున్నాయని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగక కార్మికులు అర్ధాకలితో అలాంటిస్తుంటే కార్పొరేట్ల ఆస్తులు వంద రెట్లు పెరుగుతున్నాయని, అసమానతలు, పేదరికం ఎన్నడూ లేని స్థాయికి చేరాయని, కేంద్ర ప్రభుత్వ విధానాలే ఇందుకు కారణమని విమర్శించారు. ఈ విధానాలకు ప్రత్యామ్నాయాలను సిఐటియు జాతీయ మహాసభలో రూపొందిస్తారని చెప్పారు. సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, నాయకులు సిలార్ మసూద్ మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దు అయ్యేవరకూ పోరాడతామన్నారు.

విశాఖ ఉక్కు పరిశ్రమ సహా అన్ని 2లో

మోసం తట్టుకోలేకే రాజధాని రైతు మృతి

వైసిపి తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త డైమండ్ బాబు ధ్వజం - 2 లో



పంటలు సాగవుతున్న వక్ఫ్ భూములను పరిశీలిస్తున్న సిపిఎం బృందం

వక్ఫ్ భూముల పరిరక్షణకు ఉద్యమం

- పారిశ్రామికవాడ పేరుతో కార్పొరేట్‌లకు అప్పగించేందుకు ప్రభుత్వ యత్నం
- చినకాకానిలో ప్రతిపాదిత భూములను పరిశీలించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

వక్ఫ్ భూముల పరిరక్షణ కోసం ఉద్యమిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు, ఈమని అప్పారావు ఉద్ఘాటించారు. మండలంలోని చినకాకాని గ్రామ పరిధిలో గల సుమారు 71.75 ఎకరాలను పారిశ్రామికవాడ పేరుతో ప్రభుత్వం తీసుకునేందుకు యత్నిస్తున్న నేపథ్యంలో ఆ పొలాలను సిపిఎం బృందం శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా రామారావు, అప్పారావు మాట్లాడుతూ వక్ఫ్ చట్ట ప్రకారం వక్ఫ్ భూములను తీసుకునే అవకాశం లేదన్నారు. 2లో

వక్ఫ్ భూముల పరిరక్షణకు ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

చినకాకానిలోని సర్వే నంబర్ 201, 202, 203, 204లలో వక్ఫ్ భూముల్లో వందిమందికిపైగా చిన్నా, సన్న కారు రైతులు ఏళ్ల తరబడి పసుపు, మొక్కజొన్న, ఉల్లి , పూలు, టమాట తదితర పంటలు పడిస్తున్నారని, వాటిని తీసుకుంటే ఆ రైతులు రోడ్డున పడతారని, వారి నోట్లో మట్టికొట్టొద్దని కోరారు. పశ్చిమ బైపాస్ ఏర్పాటైన తర్వాత ఆ రోడ్డుకు పక్కనే ఉన్న వక్ఫ్ భూములపై కూటమి ప్రభుత్వ కన్ను పడిందన్నారు. వీటిని తీసుకోవాలని ఆలోచనను విరమించుకోవాలని, పేద ముస్లిముల అభ్యున్నతి కోసం వీటిని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి యు.దుర్గారావు, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, నాయకులు ఎం.భాగ్యరాజు, జి.బాబు వరప్రసాద్, కె.శివశంకరరావు, రైతులు పాలడుగు రవికుమార్, పగడాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



తాత ముత్తాతల నుంచి సాగు

పగడాల శ్రీనివాసరావు, రైతు.

ఈ భూములను మా తాత ముత్తాతల నుంచి సాగు చేస్తున్నాం. పసుపు, పూలు, ఉల్లి తదితరాలను పండిస్తున్నాం. ఇప్పుడు వీటిని తీసుకుంటే మేమేంకావాలి. పంటలు పండిస్తున్న మా రైతులకే ఈ భూములను వదిలేయాలి.

పత్తిరైతు రాస్తారోకో

(మొదటి పేజీ తరువాయి)

తిరస్కరించారు. దీంతో ఆగ్రహానికి గురైన రైతులు అక్కడే రహదారిపై ఆందోళన చేపట్టారు. దళారులు తెచ్చిన పత్తిని కొంటున్నప్పటికీ ఐదు గంటల నుండి నిరీక్షిస్తున్న తమ పంటను మాత్రం కొనడం లేదని ఆగ్రహానికి గురయ్యారు. ఒక వాహనంలో పంటను తేవడానికి రూ.ఐదారువేలు ఖర్చు చేస్తున్నామని, వేబ్రిడ్జి కాట, చెక్‌పోస్టులు, లోడింగ్ తదితర ఖర్చులూ భరిస్తున్నామని, ఒకరోజు ముందుగానే రావాల్సి వస్తుండడంతో వెయిటింగ్ ఛార్జీ కింద రూ.2 వేలు చెల్లిస్తున్నామని, తీరా పంటను కొనేసమయానికి ఏదో ఒక సాకుతో తిరస్కరిస్తున్నారని వాపోయారు. అరగంటకుపైగా ఆందోళన కొనసాగడంతో ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలిసిన ఎస్ఐ నరహరి అక్కడికి చేరుకుని రైతులు, అధికారులతో మాట్లాడారు. పంట కొనుగోలుకు ఫీల్డ్ ఆఫీసర్ అంగీకరించడంతో ఆందోళన ముగిసింది. ఇదిలా ఉండగా ఆందోళన సమయంలోనూ దళారులు అక్కడే ఉండడం గమనార్హం.

ఎన్నడూ లేనంతగా కష్టాల్లో కార్మికులు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వరంగ పరిశ్రమలను కార్పొరేట్లకు కారు చౌకగా కట్టబెడుతూ కార్మిక వర్గాన్ని రోడ్డుకి లాగుతుందన్నారు. బ్రిటిష్ కాలం నాటి నుండి సాధించుకున్న హక్కులను లేబర్ కోడ్‌ల పేరుతో కాలరాస్తున్నారని అన్నారు. సకల సంపదలను సృష్టించేది కార్మికవర్గం ఒక్కటేనని, అయినా వీరు పాలకులకు పట్టడం లేదని మండిపడ్డారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాటంలో భాగంగా జరిగే సిఐటియు జాతీయ మహాసభ జయప్రదానికి కార్మికవర్గమంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం జాతా చిలకలూరిపేట, వినుకొండ, కారంపూడి, దుర్గి, మచర్లలో పర్యటించగా కార్మికులు స్వాగతం పలికారు. సిఐటియు నాయకులు శివ కుమారి, పి.వెంకటేశ్వర్లు, బి.వెంకటేశ్వర్లు, ఏపూరి గోపాలరావు, పి.మహేష్ పాల్గొన్నారు. వినుకొండలోని శివయ్య స్తూపం సెంటర్లో ఆంజనేయులు నాయక్‌తోపాటు నాయకులు కె.హనుమంతరెడ్డి మాట్లాడారు. మహాసభతోపాటు ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెకు కార్మికవర్గం, కర్షకులు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ఏపూరి గోపాలరావు, బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలి

(మొదటి పేజీ తరువాయి)

పనికి గ్యారంటీ లేకుండా, నిధులు పెంచకుండా పనిదినాలు 125 రోజులకు పెంచామని చెప్పటం మోసపూరిత ప్రచారమని విమర్శించారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ కేంద్రం అన్ని చట్టాలను రద్దు చేస్తుందని, రాష్ట్రాల హక్కులను లాగేసుకుంటోందన్నారు. జాతిపిత పేరును ఉపాధి హామీ చట్టానికి తొలగించటం దారుణమన్నారు. ఇంత జరుగుతున్నా రాష్ట్రంలో టిడిపి కూటమి పార్టీలు, ప్రధాన ప్రతిపక్షం మోడీ చట్టాలకు ఆమోదం తెలుపుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు కొరివి వినయ్‌కుమార్ మాట్లాడుతూ 13 నెలలపాటు సుదీర్ఘంగా చర్చించి, ప్రజల కోణంలో తెచ్చిన ముఖ్యమైన చట్టం ఎంజిఎన్ఇజిఎస్ అని అన్నారు. ఈ చట్టం ద్వారా రాష్ట్రంలో 26వేల ఎకరాల అసైన్డ్ భూమి సాగులోకి వచ్చిందని, పూడుకుపోయిన కాల్వలు, చెరువులు అభివృద్ధి చెందాయని తెలిపారు. సిపిఐ నాయకులు వి.రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రజలకు ఎంతోకొంత మేలు చేస్తున్న చట్టాలను కేంద్రం రద్దు చేస్తుందన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి, లేబర్ కోడ్‌లు తెచ్చిందన్నారు. పాత చట్టం పునరుద్ధరణకు ఐక్యంగా ఉద్యమించాలన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి నేతాజి మాట్లాడుతూ కేంద్రం తక్షణమే కొత్త చట్టాన్ని రద్దు చేసి, పాత చట్టాన్ని పునరుద్ధరించకపోతే రానున్న కాలంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కొత్త చట్టం రద్దు చేసి, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పునరుద్ధరించాలని రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలని, 250 రోజుల పనిదినాలు కల్పించాలని, కనీస వేతనం రూ.600లు ఇవ్వాలని, పట్టణ ప్రాంతాలకూ ఉపాధి హామీ చట్టం వర్తింప చేయాలని, తదితర డిమాండ్లతో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని రౌండ్‌టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. సిపిఐ (ఎంఎల్) ప్రజాపోరు నాయకులు పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ సరళీకరణ ఆర్థిక విధానాల ఫలితంగా వ్యవసాయ రంగం సంక్షోభంలోకి వెళ్లిపోవటంతో గ్రామీణ పేదల వలసలను ఆరికట్టడానికి ఉపాధి హామీ చట్టాన్ని తెచ్చారని, అటువంటి చట్టాన్ని రద్దు చేయటం దారుణమని అన్నారు. జాతీయ నాయకులు పేర్లు తొలగిస్తు చరిత్రో బిజెపితోనే ప్రారంభం అయ్యిందన్నట్లు కేంద్రం వ్యవహరిస్తుందన్నారు. సిపిఐ (ఎంఎల్) నాయకులు యు.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నో త్యాగాలు, సుదీర్ఘ పోరాటాలతో సాధించుకున్న చట్టాలను బిజెపి రద్దు చేస్తోందని, జాబ్‌కార్డులను కుదిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో అధికార, ప్రధాన ప్రతిపక్షాలు దీనిపై గోడమీద పిల్లి మాదిరిగా ఉంటున్నాయని విమర్శించారు. సిపిఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ నాయకులు వి.నరసింహారావు మాట్లాడుతూ వ్యవసాయ సంక్షోభం నేపథ్యంలో ఉపాధి చట్టం అమలు ఆవశ్యకత మరింత పెరిగి నేపథ్యంలో రద్దు చేయటం సరికాదన్నారు. విసికె పార్టీ నాయకులు జయసుధ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చాక గాంధీని మతోన్మాది గాడ్సే చంపాడని, ఇప్పుడు ఉపాధి హామీ చట్టానికి గాంధీ పేరును బిజెపి తొలగించి మరోసారి హత్య చేసిందని విమర్శించారు. జెడియు నాయకులు ఎన్.సాంబశివరావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వానికి అంబానీ, అదానీ తప్ప పేదలు, సామాన్యులు కనిపించట్లేదన్నారు. బిఎస్‌పి నాయకులు సిహెచ్.వాసు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను ఐక్యంగా తిప్పికొట్టాలన్నారు. ఎంసిపిఐ (యు) నాయకులు ఎ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలోని టిడిపి, వైసి పార్టీలు వ్యక్తిగత స్వార్థంతో కేంద్రం ప్రవేశపెట్టిన బిల్లుకు ఆమోదం తెలిపాయన్నారు. సమావేశంలో ఎపిఎఫ్‌టియు నాయకులు మేకల రవి, ఎపి బిసి మహాసభ నాయకులు యు.సాంబశివరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.లక్ష్మీనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఇ.అప్పారావు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం నాయకులు ఎన్.భావన్నారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్.సమీర్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.కృష్ణకాంత్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.లక్ష్మణరావు మాట్లాడారు.

మోసం తట్టుకోలేకే రాజధాని రైతు మృతి

వైసిపి తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త డైమండ్‌బాబు ధ్వజం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అమరావతి రైతుల్ని కూటమి ప్రభుత్వం నమ్మించి మోసం చేస్తోందని, పట్టా భూములు తీసుకుని చెరువులు, వాగులు ప్రవహించే మార్గాల్లో రిటర్నబుల్ ప్లాట్లు కేటాయిస్తున్నారని వైసిపి తాడికొండ నియోజకవర్గం సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్‌బాబు) ధ్వజమెత్తారు. వైసిపి జిల్లా కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. రాజధాని రైతులకు చెరువులు, వాగుల్లో ప్లాట్లు కేటాయించడం వల్ల వారు తీవ్ర మనోవేదనలో ఉన్నారని, ఆ ఆవేదనతోనే రైతు దొండపాటి రామారావు గుండెపోటుకు గురై మందడం సభలో చనిపోయారని అన్నారు. ఎన్-8 రోడ్డు నిర్మాణానికి ఇచ్చిన భూమికి ప్రత్యామ్నాయంగా ముంపు ప్రాంతంలో ప్లాట్ కేటాయించడాన్ని తట్టుకోలేకపోయిన రైతు రామారావు... మంత్రి నారాయణ, స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ ముందు తన గోడు వెళ్లబోసుకున్నా ఫలితం దక్కలేదన్నారు. ఆ ఆవేదనలో ప్రాణాలు కోల్పోయాడని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రైతులకు ప్రభుత్వం చేస్తున్న మోసంపై ప్రశ్నిస్తే అభివృద్ధిని అడ్డుకుంటున్నారని తమపై నిందలు వేస్తున్నారని అన్నారు. దొండపాటు, పిచ్చుకలపాలెంలో చెరువుల్లో రైతులకు ప్లాట్లు ఇచ్చారని, ఆవేదనలో ఉన్న రైతులు తమ బాధను ఎవరికి చెప్పుకోలేక కుమిలిపోతున్నారని, రైతులకు మద్దతుగా తాము పోరాటం చేస్తామని చెప్పారు.



రేపు యుటిఎఫ్ పల్నాడు జిల్లా కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - దుర్గి

వినుకొండలో ఆదివారం జరిగే యూటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఆంగోతు శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు దుర్గి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మండల అధ్యక్షులు మారాసు వెంకటేశ్వరావు అధ్యక్షతన సమావేశం శుక్రవారం జరిగింది. ఆంగోతు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు, పీఆర్సి, డిఎ ఆర్థిక బకాయిలపై జిల్లా కౌన్సిల్ చర్చించి తీర్మానాలు చేస్తామని, ఉపాధ్యాయులంతా హాజరవ్వాలని కోరారు. అనంతరం ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరించారు.

900 అడుగుల దూరంతో విజేతగా వేటపాలెం జత

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా



నరసరావుపేటలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల పందేలు శుక్రవారం రెండో రోజుకుచేరాయి. పోటీలను ప్రారంభించిన చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ మెట్ట పైర్లు పండిస్తున్న పెద్ద రైతుల ఇళ్లలో మాత్రమే ఎడ్లు ఉంటున్నాయని, పశుగ్రాసం కొరత యాంత్రికీకరణ పెరిగిన నేపథ్యంలో ఎడ్ల పోషణకు రైతులు ముందుకు రావడం లేదని అన్నారు. ఒంగోలు జాతి పశువులకు దేశీయ స్థాయిలో పేరుగాంచాయని, వీటి పెంపకానికి రైతులు ముందుకు రావాల్సిన అవసరం ఉందని అన్నారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతతూ ఒకప్పుడు వ్యవసాయ రంగంలో కీలక పాత్ర పోషించిన ఎడ్లు ప్రస్తుత కనుమరుగైపోతున్నాయని, వాటిపోషణ పట్ల ఆసక్తి రేకెత్తించడానికి ఇలాంటి ప్రదర్శనలు దోహదం చేస్తాయని చెప్పారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో బాపట్ల జిల్లా, చుండూరు మండలం, వేటపాలెం గ్రామానికి చెందిన ఆర్.కె బుల్స్ అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్ల జత 900 అడుగుల దూరాన్నిలాగి ప్రథమ స్థానంలో నిలిచి రూ.30 వేలు నగదు కైవశం చేసుకున్నాయి. నరసరావుపేట మండలం, దొండపాడు గ్రామానికి చెందిన యర్రం రాజశేఖర్ ఎడ్ల జత 36,000 అడుగులు లాగి ద్వితీయ స్థానంతో రూ.25 వేలు, రొంపిచర్ల మండలం పరగటిచర్ల గ్రామానికి చెందిన కామినేని విక్రమ్ చౌదరి ఎడ్ల జత 3383.01 అడుగుల దూరంతో మూడో స్థానంలో నిలిచి రూ.20 వేలు, ముప్పాళ్ల మండలం మాదల గ్రామానికి చెందిన పొన్నెబోయిన విష్ణు భరత్ యాదవ్ ఎడ్ల జత 3309 అడుగుల దూరంతో నాగులో స్థానంలో నిలిచి రూ.15 వేలు నగదు కైవసం చేసుకున్నాయి. ఈ సందర్భంగా విజేలుగా నిలిచిన ఎడ్ల జతల యజమానులకు బహుమతులను ప్రదానం చేసి సత్కరించారు.

నేడు పలు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

పల్లె పండుగ 2.0 కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని నాగులవరం, కొప్పునూరు గ్రామాల్లో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పర్యటించనున్నారు. నూతనంగా నిర్మించిన మూడు మిని గోకుళాల షెడ్లను ఆయన ప్రారంభించడంతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలపై స్థానిక నేతలతో సమీక్షిస్తారని ఎమ్మెల్యే కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొంది.

కెవిపి కాలనీలో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : స్థానిక కెవిపి కాలనీలో శుక్రవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. డిఎస్‌పి కె.అరవింద్ ఆధ్వర్యంలో నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని కేవీపీ కాలనీ, 1వ లైన్, 10వ అడ్డరోడ్డులో తనిఖీలు నిర్వహించారు. పాత నేరస్తులు, రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తుల నివాసాల్లో తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా ఉన్న వాహనాలు, వ్యక్తుల వివరాలను పరిశీలించారు. ఎస్‌పి వకుల్ జిందాల్ మాట్లాడుతూ కేవీపీ కాలనీ 1వ లైన్ ప్రాంతంలో గంజాయి వినియోగం జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు తనిఖీలు చేపట్టామన్నారు. సుమారు 500 ఇళ్లను తనిఖీ చేశామని, సరైన ధ్రువపత్రాలు లేని 40 ద్విచక్ర వాహనాలు 2 ఆటోలను సీజ్ చేశామని తెలిపారు. పట్టాభిపురం సీఐ వెంకటేశ్వర్లు, నగరంపాలెం సిఐ సత్యనారాయణ, ఎస్ఐలు పోలీసులు పాల్గొన్నారు.



ఇసిఐ నెట్‌వర్క్ యాప్‌లో ఓటర్ల మ్యాపింగ్

ప్రజాశక్తి-గుంటూరు

ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా నెట్‌వర్క్‌యాప్‌లో ఓటర్ల మ్యాపింగ్ జరుగుతోందని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకూ 46.96 శాతం మ్యాపింగ్ పూర్తి అయ్యిందని తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం రూపొందించిన సమగ్రమైన యాప్‌లో ఓటర్ల జాబితా మేరకు ఓటర్ల మ్యాపింగ్ జరుగుతోందన్నారు. ఇందులో తాడికొండ నియోజకవర్గంలో 56.42 శాతం, మంగళగిరి నియోజకవర్గంలో 38.20 శాతం, పొన్నూరు నియోజకవర్గంలో 49.42 శాతం, తెనాలి నియోజకవర్గంలో 40.68 శాతం, ప్రత్తిపాడు నియోజకవర్గంలో 49.38 శాతం, గుంటూరు వెస్ట్‌లో 49.44 శాతం, గుంటూరు ఈస్ట్‌లో 48.51 శాతం నమోదు జరిగిందని వివరించారు. మొత్తం 17,98,368 ఓటర్లలో 8,44,489 మంది ఓటర్లను మ్యాపింగ్ చేసినట్లు చెప్పారు. జనవరి 10వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నాయని, ఈ ప్రక్రియలో తప్పులు జరిగితే ఫారం 6, 7, 8 ద్వారా సరిచేయటం జరుగుతుందన్నారు. బిఎల్‌ఒలకు కలర్ ఓటర్ జాబితాలను పంపిణీ చేయటం జరిగిందని, బిఎల్‌ఒలకు గుర్తింపు కార్డులు కూడా అందచేశామన్నారు. ఇంటి నెంబర్ లేని ఇళ్లకు నోషనల్ ఇంటి నెంబర్లను సంబంధిత మున్సిపాల్టీ పంచాయతీల ద్వారా ఏర్పాటు చేయటానికి ఆదేశాలు జారీ చేయటం జరిగిందన్నారు. 2009 సంవత్సరానికి ముందు ఉన్న ఈవిఎంలు వెనక్కు పంపాలని ఆదేశాలు ఉన్నాయని, అయితే జిల్లాలో అప్పటి ఈవిఎంలు ఏమీ లేవని తెలిపారు. డిఆర్‌ఒ ఖాజావలి మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల జాబితా రివిజన్ జరుగుతుందని చెప్పారు. సమావేశంలో బిఎస్‌పి నాయకులు సిహెచ్.వాసు, కాంగ్రెస్ నాయకులు బి.సునీల్, టిడిపి నాయకులు కె.శివరామయ్య, వైసిపి నాయకులు కె.ప్రేమ్‌కుమార్, జనసేన నాయకులు సిహెచ్.త్రినాథ్, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పట్టణంలో జనావాసాల మధ్య వ్యభిచారం

సబ్ కలెక్టర్ చొరవతో వ్యభిచార గృహం సీజ్

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో సుదీర్ఘకాలంగా వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ ఇంటిని సబ్ కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది శుక్రవారం సీజ్ చేశారు. తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ, డీఎస్పీ బి జనార్ధన రావు, ఒన్ టౌన్ సిఐ మల్లికార్జునరావు వెల్లడించిన వివరాల ప్రకారం సాలిపేటలో ఓ ఇంటిలో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో అక్టోబర్ 28న పట్టణ ఒన్ టౌన్ పోలీసులు దాడి చేశారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో నిర్వాహకురాలు చావలి హైమావతి, మైనర్ బాలిక, ముగ్గురు మహిళలు, విటులను అరెస్టు చేశారు. దీనిపై తదుపరి జరిగిన విచారణలో జనావాసాల మధ్య హైమావతి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఇంటిని వ్యభిచారం నిర్వహించేందుకు వీలుగా చిన్న చిన్న గదులుగా మార్చి, అందులో మంచాలు, కూలర్లు, ఫ్రిజ్లు, ఏసీలు సమకూర్చి, అనుకోకుండా దాడులు జరిగితే పారిపోయేందుకు వీలుగా వెనుక నుంచి దారి ఏర్పాటు చేసింది. గతంలో హైమావతిపై వ్యభిచార నేరం కింద రెండు కేసులు నమోదు కాగా ప్రస్తుతం మూడో కేసులో రిమాండ్‌లో ఉంది. స్థానికులు కూడా వ్యభిచార నిర్వహణపై అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ నివేదికను అధికారులు సబ్ కలెక్టర్ సంజన సింహ ముందుంచారు. సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్గా ఇంటిని సీజ్ చేయాలని ఆదేశాలిస్తూ, ఆదేశాలను అమలు చేయాల్సిందిగా మండల ఎగ్జిక్యూటివ్ మ్యాజిస్ట్రేట్ కెవి గోపాలకృష్ణను పోలీసులను ఆదేశించారు. డి.ఎస్.పి, ఒన్ టౌన్ సిఐ సమక్షంలో ఇంటిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాది కాలం వరకు ఎవరు ఆ ఇంటిలో అడుగు పెట్టేందుకు వీలులేదని, కోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అదే సమయంలో ఇళ్లను అద్దెకిచ్చేవారు జాగ్రత్తగా ఉండాలని, అద్దెకు తీసుకున్న వ్యక్తులు ఇంటిని అసాంఘిక కార్యక్రమాలకు వినియోగిస్తే సీజ్ చేయాల్సి వస్తుందని చెప్పారు. వారి వెంట ఎస్సైలు, పలువురు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

2026 క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక కొత్తపేట టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో రూపొందించిన కొత్త సంవత్సరం 2026 క్యాలెండర్ను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లీగల్ సెల్ బృందానికి ఆయన ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో లీగల్ సెల్ అధ్యక్షులు ఇందుపల్లి రాజారాం, కార్యదర్శి తాడిశెట్టి వెంకటేశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు తాడిబోయిన శ్రీనివాసరావు, మద్ది మల్లికార్జు నరావు, ఎం.ఎల్ జగదీశ్వరాంబ, షేక్ రహిమాన్, వి లలిత కుమారి, వి మహేష్, జి రాంబాబు పాల్గొన్నారు.

కళాకారులకు ప్రాణ వాయువు కళే

ప్రజాశక్తి - తెనాలి

ఆంధ్ర గాన కోకిల పురస్కార గ్రహీత, అంతర్జాతీయ రంగస్థల కళాకారులు ఏవి సుబ్బారావు పురస్కార ప్రధానోత్సవం శుక్రవారం రాత్రి జయప్రకాష్ చౌక్‌లో కళావేదికపై నిర్వహించారు. ఏవి ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ మాటల రచయిత బుర్రా సాయి మాధవ్ పాల్గొని మాట్లాడుతూ కళాకారులకి ప్రాణవాయువు కళే నన్నారు. కళలు సంస్కృతి సాంప్రదాయాలకు గుర్తింపు తెస్తాయన్నారు. తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ మాట్లాడుతూ కళాకారుల నిరంతర సాధనకు గుర్తింపునిచ్చేది పురస్కారాలేనని చెప్పారు. ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ సమాజంలోని ఇతివృత్తాలకు అద్దం పట్టేవి నాటకాలని, వాటిని రస రంజికంగా ప్రదర్శించే వారే కళాకారులని చెప్పారు. సభలో అభినవ అర్జున బిరుదాంకితులు కురిటి సత్యం కు ఏవి సుబ్బారావు పురస్కారాన్ని అందించి సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ తాడిబోయిన రాధిక, మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ దుర్గాప్రసాద్ సినీ నటుడు నాయుడు గోపి, తాడిబోయిన అఖిలేష్, ఏవి సుబ్బారావు కుటుంబ సభ్యులు కోటేశ్వరరావు, ఆదినారాయణ రావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వెయ్యి మంది బాలికలకు ఉచిత హెచ్‌పీవీ టీకా

ప్రజాశక్తి - మంగళగిరి

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుంచి బాలికలను రక్షించే ఉద్దేశంతో మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షులు ప్రెగడ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం వి.జె. జూనియర్ కాలేజి ఆవరణలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. ప్రభుత్వ, మున్సిపల్, ఐడెడ్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదువుతున్న 9 నుంచి 14 సంవత్సరాల లోపు బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుంచి రక్షణ కల్పించే క్వాడ్రివాలెంట్ హెచ్‌పీవీ టీకాను 2026 జనవరి 7న ఉచితంగా అందజేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సుమారు వెయ్యి మందికి పైగా బాలికలకు టీకా వేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వేల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రతి రెండు నిమిషాలకు ఒక మహిళ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన తెలిపారు. ఈ ప్రమాదకర వ్యాధి నివారణకు రెండు మోతాదులుగా హెచ్‌పీవీ టీకా తీసుకోవడం అత్యంత అవసరమని వివరించారు.ఈ కార్యక్రమాన్ని సుమారు రూ.50 లక్షల వ్యయంతో, తల్లిదండ్రుల అనుమతితో పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ క్యాన్సర్ నిపుణులు, అనుభవజ్ఞులైన వైద్యులు, నర్సుల పర్యవేక్షణలో టీకా కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరించి మంగళగిరి నియోజకవర్గంలోని అర్హత కలిగిన ప్రతి బాలికకు హెచ్‌పీవీ టీకా అందించడమే లక్ష్యంగా రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. తల్లిదండ్రులు ఈ అంశంపై అవగాహన పెంచుకొని తమ పిల్లలను ప్రాణాంతక వ్యాధి నుంచి కాపాడుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రోటరీ క్లబ్ కార్యదర్శి పారేపల్లి నిరంజన్ గుప్తా, ప్రాజెక్ట్ శక్తి చైర్మన్ ఇసునూరు అనిల్ చక్రవర్తి, ప్రాజెక్ట్ కార్యదర్శి గాజుల శ్రీనివాస్, సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చనుమోలు గోపాల్, రోటరీ సభ్యులు వడ్లమూడి శ్రీనివాస్, జొన్నాదుల బిక్షారావు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేపై రైతులకు అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - కాకుమాను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేలో భాగంగా కాకుమాను మండలంలో కొమ్మూరు, అప్పాపురం,చేంటూరు ఈ మూడు గ్రామాలలో వచ్చేనెల జనవరి 2 వ తారీకు నుండి రీ సర్వే ప్రారంభించడం జరుగుతుందని మండల తహసిల్దార్ బి వెంకటస్వామి తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం కొమ్మూరు నందు గ్రామసభ నిర్వహించి, రైతులకు అవగాహన కొరకు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో రైతులు అడిగిన వివిధ ప్రశ్నలకు తహశీల్దార్ సమాధానాలు తెలియజేశారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - పెదనందిపాడు

శ్రీ నరసింహ హైస్కూల్ పూర్వ విద్యార్థి ముద్దన నారాయణరావు మూడవ వర్ధంతి సందర్భంగా శుక్రవారం వారి బావ చిమ్మినేని వెంకటసుబ్బారావు, పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు, పరీక్షలకు అవసరమైన రైటింగ్ ప్యాడ్స్, పెన్నులు,పెన్సిల్స్, ఎరేజర్, షార్పనర్లు అందజేశారు. డిసెంబరు 21, 22, 23 తేదీలలో కాకినాడలో జరిగిన చెకుముకి సంబరాలలో ద్వితీయ బహుమతి సాధించిన విద్యార్థులకు కూడా ఈ బహుమతులు అందించారు. పరిటాలవారిపాలెం గ్రామానికి చెందిన స్కూలు పూర్వ విద్యార్థి ఒకరు, టాలెంట్ టెస్ట్ లో బహుమతి సాధించిన విద్యార్థులకు ,ఒక్కొక్కరికి రూ.వెయ్యి బహుకరించడం జరిగింది.స్కూలు హెడ్ మాస్టర్ ముద్దన శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం బహుమతి ప్రధానోత్సవం సభ జరిగింది. ఈ సభలో పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం కోశాధికారి దొప్పలపూడి రమేష్ బాబు , . హెచ్.ఎమ్ ముద్దన శ్రీనివాసరావు, చిమ్మినేని నరేష్ ,జంపని రామారావు, పాఠశాల ఉపాధ్యాయులు ముద్దన సత్యనారాయణ, ఎస్.కె.షఫీ, ఎస్.కె.రహీం , శివలీల పాల్గొన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

ప్రజాశక్తి - తెనాలి

వివాహేతర సంబంధం ఒక వ్యక్తిపై దాడికి దారి తీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుల్తానాబాద్ కు చెందిన మహిళ కొంతకాలం క్రితం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామలింగేశ్వరపేట రైస్ కాలనీకి వచ్చి ఉంటుంది. మరో వ్యక్తి ఆంజనేయులుతో వివాహేతర సంబంధం కొన సాగిస్తుంది. ఈ విషయం తెలుసుకున్న మహిళ భర్త గంగ శుక్రవారం రాత్రి కత్తితో ఆంజనేయులుపై దాడి చేశాడు. సమాచారం అందుకున్న ఒన్ టౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయాలని ప్రచారం

ప్రజాశక్తి- తాడేపల్లి



సిఐటియు అఖిలభారత మహా సభను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం తాడేపల్లి పట్టణంలోని బ్రహ్మానం దపురంలో ఎసిసి కార్మికుల్లోనూ, భవన నిర్మాణ కార్మికుల్లోనూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు వేముల దుర్గారావు మాట్లాడుతూ ఈనెల 31 వ తారీకు నుండి జనవరి 4 తారీఖు వరకు విశాఖపట్నంలో జరుగుతున్న మహాసభలకు, నాలుగో తారీఖు నాడు లక్షలాది మందితో జరగనున్న కార్మికుల ర్యాలీలో యావన్మంది పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మహాసభలు కార్మికుల పోరాటాలకు పదును పెట్టే విధంగా ఈ మహాసభల్లో దిశా నిర్దేశం చేయబోతోంది అని చెప్పారు. ఆల్ ఇండియా వేదికగా కార్మిక పోరాటాల్లో కాకలు తీరిన అనేకమంది కార్మిక నాయకులు ఈ మహాసభలో పాల్గొని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గానికి చేస్తున్న నష్టాన్ని, కార్మిక వర్గం పోరాడి సాధించిన చట్టాలను తుంగలో తొక్కేసి కార్మికులను ఇబ్బంది పెడుతున్నటువంటి తీరును చర్చించి, పోరాటాలు రూపొందించబోతున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో కే స్టీవెన్, సూర్య ప్రకాష్, అంకయ్య, ఆశీర్వాదం, సాంబయ్య, రమాదేవి, లక్ష్మీ, యెహెూషువ, సింగ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మాచర్లలో సినిమా చిత్రీకరణ

ప్రజాశక్తి - మాచర్ల

పల్నాటి వారసత్వాన్ని ప్రపంచానికి చాటేలా చిత్రాలు రావాలని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి కుమారుడు గౌతమ్ ఆకాంక్షించారు. శుక్రవారం స్థానిక చెన్నకేశవ స్వామి దేవస్థాన ప్రాంగణంలో పద్మిని సినిమాస్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న నూతన చిత్ర షూటింగ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చిత్రంలోని ఒక పాటకు కెమెరా స్విచ్ ఆన్ చేశారు. చిత్ర నిర్మాత శివప్రసాద్, దర్శకులు పఠాన్ నాగూర్ ఖాన్‌ను ఆయన అభినందించారు.

కమలారామ్‌కు స్వర్ణ నంది అవార్డు

ప్రజాశక్తి - బొల్లాపల్లి (వినుకొండ)



వినుకొండ పట్టణానికి చెందిన రచయిత, కవిరత్న, కళారత్న అవార్డ్ గ్రహీత, జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు, జాషువా సమాఖ్య గౌరవాధ్యక్షులు, కమలారామ్‌ను స్వర్ణనంది అవార్డుకు ఎంపిక చేసినట్లు విశ్వ జనని జాతీయ సంస్థ అధ్యక్షులు బి.బ్రహ్మానందం శుక్రవారం ప్రకటించారు. వచ్చేనెల 4న విజయవాడలోని ఆలపాటి రామారావు ఏసీ ఫంక్షన్ హాల్, హనుమాన్‌పేట హాలులో అవార్డును ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. కమలారామ్‌కు కవులు, కళాకారులు మిత్రులు అభినందనలు తెలిపారు.



ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆటల పోటీలు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

క్రిస్మస్ సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలో కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఆయా క్రీడల్లో ఎనిమిదేసి జట్లు పాల్గొనగా కబడ్డీలో కెల్విన్ టీం, వాలీబాల్‌లో సత్యనారాయణరెడ్డి జట్టు విజేతలుగా నిలిచాయి. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు రోహిత్ ఆనంద్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత రాష్ట్రంగా సంపూర్ణ మహిళ రక్షణ రాష్ట్రంగా నిర్మించుకోవడం కోసం ఎస్ఎఫ్ఐ కృషి చేస్తుందని చెప్పారు. విద్యార్థులు, యువత సోషల్ మీడియా, స్మార్ట్ ఫోన్లకు బానిసలు అవుతున్నారని వాటన్నిటిని పక్కనపెట్టి చదువుపై శ్రద్ధ వహించాలని కోరారు. చదువుతోపాటు ఆటల్లో చురుగ్గా పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో కె.వంశీ, యాసిన్, నాగూర్, రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు ఎస్సీ, ఎస్టీల ప్రత్యేక గ్రీవెన్స్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట కలెక్టరేట్‌లో నేడు ఎస్సీ, ఎస్టీల ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వికలాంగులు కూడా ఈ కార్యక్రమం ద్వారా అర్జీలిచ్చి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రతినెలా 4వ శనివారం నిర్వహిస్తున్న కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొంటారని ఆయా శాఖలకు సంబంధించిన సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని పేర్కొన్నారు.



చిలకలూరిపేట, మాచర్లలో జాతా ప్రచారాల్లో మాట్లాడుతున్న కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్

ఆకాశంలో ధరలు.. పాతాళంలో వేతనాలు

కార్మికుల సమస్యలను విస్మరించిన ప్రభుత్వాలు - ప్రజావ్యతిరేక విధానాలపై సిఐటియు జాతీయ మహాసభలో ఉద్యమ కార్యాచరణ - మహాసభ జయప్రదం కోసం పలుచోట్ల సిఐటియు జాతా ప్రచారం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

విశాఖలో ఈనెల 31 నుండి వచ్చేనెల 4 వరకు జరిగే సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయాలని, 4న కార్మిక ర్యాలీ, బహిరంగ సభకు లక్షలాదిగా కార్మికులు తరలిరావాలని కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ పిలుపునిచ్చారు. సిఐటియు చేపట్టిన ప్రచార జాతా గురువారం పట్టణానికి చేరగా స్థానిక పండరిపురంలోని సిఐటియు కార్యాలయం వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎన్ఆర్‌టి సెంటర్, కళామందిర్ సెంటర్ వద్ద రాధాకృష్ణ, ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐదేళ్లుగా కార్మికులు పోరాడి మోడీ ప్రభుత్వాన్ని నిలువరించారన్నారు. కార్మికుల సంక్షేమ బోర్డులో సుమారు రూ.38 వేల కోట్ల నిధులుంటే ఆ బోర్డును రద్దు చేసిందని, మరోవైపు కార్పొరేట్ శక్తులకు 11 ఏళ్లలో రూ.16.20 లక్షల కోట్లు రాయితీలిచ్చారని విమర్శించారు. కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లను తెచ్చారని మండిపడ్డారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.26 ఇవ్వాలని, స్కీము వర్కర్లను, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, డైలీ వేజ్ కార్మికులను రెగ్యులైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలన్నారు. కార్మిక సమస్యలపై ఫిబ్రవరి 12న సార్వత్రిక సమ్మెకు సిద్ధమవ్వాలని కార్మిక, కర్షకులకు పిలుపునిచ్చారు. కోటప్పకొండ అడ్డరోడ్డు వద్ద సిఐటియు జిల్లా నాయకులు సిలార్, మండల కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ధరలు ఆకాశంలో జీతాలు పాతాళంలో ఉంటున్నాయని, కార్మికులు, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా విశాఖపట్నంలో సిఐటియు జరిగే అఖిల భారత సిఐటియు మహాసభలో పోరాట కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జె.రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎస్.లూథర్, సిఐటియు నాయకులు ఎస్.బాబు, టి.ప్రతాప్‌రెడ్డి, భవన నిర్మాణ, ఆటో కార్మికులు, వీధి విక్రేతలు పాల్గొన్నారు

ప్రజాశక్తి - మాచర్ల

సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేద్దామని సిఐటియు పల్నాడు జిల్లా కార్యదర్శి ఆంజనేయులు నాయక్ పిలుపునిచ్చారు. మహాసభల జయప్రదం కోరుతూ ప్రచారజాత పల్నాడు జిల్లాలో పర్యటిస్తూ శుక్రవారం మాచర్ల చేరింది. స్థానిక మున్సిపల్ కార్యాలయ సెంటర్లో జరిగిన ప్రదర్శనలో ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం కార్మికవర్గం ఎన్నడూ లేని తీవ్రమైన కష్టాలను ఎదుర్కొంటున్నా యన్నారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయన్నారు. కార్మికుల జీతాలు పాతాళంలో అదాని అంబానీ కార్పొరేట్ల ఆస్తులు ఆకాశంలో ఉన్నాయని, అసమానతలు, పేదరికం ఎన్నడూ లేని స్థాయికి చేరిందని చెప్పారు. ఈ నేపథ్యంలో విశాఖలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలో భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సిఐటియు అధ్యక్షులు బి.మహేష్, నాయకులు వెంకటరత్నం, వై.సురేష్, వి.వెంకట్రావ్, శోభన్‌కుమార్, కె.రమణ, అనసూర్య, కుమారి పాల్గొన్నారు.

పొగాకు రైతులకు ఇంకా రాని రూ.2.90 కోట్లు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పొగాకు కొనుగోలు తాలుకు డబ్బులు రూ.2.90 కోట్ల వరకు రైతులకు ఇంకా ఇవ్వాల్సి ఉందని కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చిలకలూరిపేట, యడ్లపాడు, మండలాల్లో రైతుల వద్ద నుంచి పొగాకు కొనుగోలు చేసి ఇప్పటికీ డబ్బులు చెల్లించలేదని అన్నారు. అనకాపల్లిలో భూములను కార్పొరేట్లకు కారుచౌకగా అప్పగించడానికి వ్యతిరేకంగా పోరాడుతున్న రైతు నాయకులు అప్పలరాజుపై పీడీ యాక్టు కింద కేసు నమోదు దారుణమన్నారు. బలవంతపు భూ సేకరణకు వ్యతిరేకంగా, రైతుల పక్షాన నిలబడిన నాయకులపై గతంలో 19 కేసులు బనాయించారని, ప్రస్తుతం సిఎం చంద్రబాబు స్వయంగా పీడీ కేసులు పెట్టాలని చెప్పటం వల్ల అప్పలరాజుపై పెట్టారని అన్నారు. గత ప్రభుత్వ దారిలోనే ఇప్పటి ప్రభుత్వమూ ఉందన్నారు. అప్పలరాజుపై కేసులు ఎత్తేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త ఉపాధి పథకం వల్ల పేదలకు పనులు దక్కకపోవడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వానికి భారం పడుతుందని చెప్పారు. ఈ విధానాలన్నింటిపై పోరాడతామన్నారు.

విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన



ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్న చిప్పగిరి పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా, పత్తికొండలోని కోర్టులో కేసులో నిందితుణ్ణి అతని లాయర్ ప్రవేశపెడుతుండగా చిప్పగిరి పోలీసులు కోర్టు హాల్లోకి వచ్చి లాయర్‌ను నెట్టేసి నిందితుణ్ణి జీపులో తీసుకెళ్లారని, ఈ ఘటనను నిరసిస్తూ స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. నాలుగు న్యాయస్థానాల్లో విధులను న్యాయవాదులు బహిష్కరించారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు ఎస్.బ్రహ్మానందరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పత్తికొండ కోర్టు ఆవరణలో ఘటనను నిరసిస్తూ స్థానిక కోర్టు ముందు న్యాయవాదులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కోర్టు విధులను బహిష్కరించారు. న్యాయాన్ని కాపాడాల్సిన పోలీసులే న్యాయస్థానాల పరిధిలో ఉన్న న్యాయవాదులపై భౌతిక దాడులకు దిగడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టన్నారు. న్యాయవాదులపై దాడికి పాల్పడిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. న్యాయవాదులకు వృత్తిపరమైన రక్షణ కల్పించేందుకు ప్రత్యేక 'అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్'ను వెంటనే అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.




అందరికీ ఆర్థిక సహకారం అందించేందుకు 'అభ్యుదయం'

రుణ వితరణ పథకాల అమలు కోసం సమ్మిళిత కార్యక్రమం చేపట్టిన పల్నాడు కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కేంద్ర, రాష్ట్ర పభుత్వాలు అమలు చేస్తున్న అన్ని రకాల రుణ వితరణ పథకాలు 100 శాతం లబ్ధిదారులకు అందించేందుకు 'అభ్యుదయం' పేరిట జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా సమ్మిళిత కార్యక్రమం చేపట్టారు. బ్యాంకర్లు, ప్రభుత్వ శాఖల అధికారులను ఒక్క తాటిపైకి తెచ్చి రుణాల వితరణ మరింత సులభతరం చేసేందుకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం నరసరావుపేటలోని కలెక్టరేట్ నుండి జిల్లా ప్రజలకు ఆర్థిక సహాయం, వ్యవస్థీకృత రుణ సహాయం, బీమా సేవలు వంటి సేవలు మెరుగుపరిచే విషయంపై అధికారులతో సమీక్షించారు. జిల్లా ప్రజల ఆర్థిక అభివృద్ధికోసం అన్ని పథకాలను పర్యవేక్షించేందుకు అభ్యుదయం పేరుతో కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ప్రమాద, జీవిత బీమా సేవలు లేనివారి వివరాలు సేకరించి వారందరికీ బీమా సేవలు అందించేలా చూడాలన్నారు. పీఎం స్వానిధి పథకం ద్వారా వీధి వ్యాపారులకు రుణ వితరణ లక్ష్యం వంద శాతం చేరుకోవాలన్నారు. సిబిల్ స్కోర్‌తో సంబంధం లేకుండా రుణాలిచ్చేందుకు బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ప్రతి మండలానికి ఒక క్లస్టర్ యూనిట్ ను గుర్తించి ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు అవకాశాలపై డీఆర్‌డీఏ, వ్యవసాయ, ఉద్యాన, ప్రకృతి వ్యవసాయం అధికారులు నివేదిక ఇవ్వాలన్నారు. నియోజకవర్గానికి ఒక గ్రామంలో వంద శాతం ఇళ్లకు సోలార్ విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసి మోడల్ సోలార్ విలేజ్‌గా తయారు చేయాలన్నారు. పంట రుణాలివ్వాలని, వాహన రుణాలు, పారిశ్రామిక రుణాలు సాచురేషన్ స్థాయిలో అందించాలని చెప్పారు.


పెదకాకానిలో


దుగ్గిరాలలో


మంగళగిరిలో

ఉపాధి చట్టం పునరుద్ధరణ కోసం వినతులు

ప్రజాశక్తి - పెదకాకాని

జాతీయ ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరును తొలగించడం సరైనది కాదని మండల సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. గత ప్రభుత్వాలు 2005వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రూపొందించారు అని, నేడు ప్రభుత్వాలు ఆ పథకానికి తూట్లు పొడిచే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. పనిని బట్టి నిధులు కాకుండా నిధులను బట్టి పని అనే చందంగా తయారు చేశారన్నారు. కొత్త ఉపాధి చట్టం ప్రకారం వ్యవసాయ పనులు ఉన్న రోజుల్లో 60 రోజులు ఉపాధి హామీ పనులు నిలిపి వేస్తున్నారన్నారు. దీనివల్ల భూమిలేని కూలీలు భూస్వాముల దగ్గర వెట్టి చాకిరి చేయవలసి వస్తుంది అన్నారు. రైతు కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించి వారికి రోజుకి ఉపాధి వేతనం రూ.700 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోటిపల్లి. సత్యనారాయణ ఉల్లంగుల శివయ్య, వీరస్వామి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని పేరుకులపూడి గ్రామంలో ఉపాధి కూలీలతో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు మాట్లాడారు. విజయవాడ అలంకార్ సెంటర్ వద్ద ధర్నా చౌక్‌లో జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపిచ్చారు. ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయటాన్ని వ్యతిరేకిస్తూ వేరుకలపూడి చొక్కా పిల్లవారిపాలెం ఏమని దుగ్గిరాల చిలువూరు తుమ్మపూడి గ్రామాలలో కరపత్రాలు పంపిణీ చేసి విజయవాడలో జరిగే కార్యక్రమాన్ని జయప్రద చేయాలని కోరారు. కార్యక్రమం కార్యక్రమంలో వై. బాబురావు నాగలక్ష్మి పి. సుబ్బారావు శ్రీలక్ష్మి ఎం.కోటేశ్వరావు బి. చిరంజీవి పాల్గొన్నారు.

ప్రజాశక్తి మంగళగిరి

2025 బి జి ఆర్ ఏ ఎం జి చట్టాన్ని రద్దుచేసి, మహాత్మా గాంధీ 2025 జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ శుక్రవారం సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, మున్సిపల్ యూనియన్, కౌల్ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళగిరి డిప్యూటీ తాహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య, బి వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు యు దుర్గారావు, సిఐటియు మంగళగిరి పట్టణ కార్యదర్శి ఎం బాలాజీ, మున్సిపల్ యూనియన్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు వై శివ నాగేశ్వరరావు, ఎం వెంకటేశ్వరమ్మ, వి వెంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకాలపు వేతనాల కోసం మోకాళ్లపై నిరసన



ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మున్సిపల్ కార్మికుల సమ్మె కాలపు వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం ఎర్రబాలెంలో మోకాళ్లపై కార్మికులు సిఐటియు రాజధాని డివిజన్ నాయకులు ఎం రవి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత సంవత్సరం డిసెంబర్ 26న మున్సిపల్, ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెబాట పట్టిన నేపథ్యంలో ప్రభుత్వం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని, సమ్మె కాలానికి వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చి నేటికి సంవత్సరం పూర్తయిన ఇచ్చిన హామీని ఇప్పటివరకు అమలు చేయలేదని అన్నారు ప్రభుత్వం, మున్సిపల్ మంత్రి, అధికారులు ఇచ్చిన హామీ మేరకు వెంటనే మున్సిపల్, ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె కాలపువేతన బకాయిలను కార్మికుల అకౌంట్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో మున్సిపల్ కార్మికుల సమ్మెబాట పట్టిన నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను జీవోల రూపంలో విడుదల చేయాలని పలుమార్లు రాష్ట్ర వ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టిన నేపథ్యంలో జీవోలు ఇస్తామని హామీలు ఇచ్చారని అవి కూడా అమలు చేయలేదని ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గత ఒప్పందాల కు వెంటనే జీవోలు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. డిసెంబర్ 31 నుండి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరుగుతున్న సిఐటియు అఖిల భారత 18వ మహాసభలను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. జనవరి 4వ తేదీన విశాఖలో జరిగే కార్మిక మహా ర్యాలీలో అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు కార్మికుల మెడకు ఉరి తాళ్లుగా మారే లేబర్ కోడులు ,నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం అంతా పాల్గొనాలని కోరారు ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఎంటిఎంసి రాజధాని ప్రాంత యూనియన్ నాయకులు టి బాబు, టి ఆదిలక్ష్మి, కే కోటేశ్వరి, ఎం పార్వతి, ఎన్ దివ్య, కొండలు, గోపి, ఆంజనేయులు, వెంకటేశ్వరరావు, మేరీ, సుజాత, అంజలి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- తాడేపల్లి : గత సమ్మెకాలకు ఒప్పందాల ప్రకారం వేతనాలను మున్సిపల్ కార్మికులకువెంటనే చెల్లించాలని సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రాజధాని ముఖ ద్వారమైన ఉండవల్లిలో కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఎంటిఎంసి రాజధాని ప్రాంత యూనియన్ నాయకులు స్వర్ణ కుమారి,శాంత కుమారి, కుశలరావు, ఎడ్ల సుందర్రావు, కే మేరీ, బాబురావు,స్వరూప, శ్రావణి, శ్రీను,సిఐటియు, ప్రజాసంఘాల నాయకులు వి వెంకటేశ్వరరావు, ఆర్వి రాఘవయ్య, కె రామకృష్ణ, ఈమని రామారావు, పి గాంధీ, వి పార్థసారది పాల్గొన్నారు.



మిర్చి యార్డు చైర్మన్‌గా కుర్రా అప్పారావు

ఆశావాహులకు నిరాశ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న గుంటూరు మిర్చి యార్డు పాలక మండలి నియామకంపై ఎట్టకేలకు టిడిపి అధిష్టానం పచ్చజెండా ఊపింది. ఆసియాలో పేరెన్నిక గన్న మిర్చి యార్డు చైర్మన్‌గా జిల్లాకు చెందిన సీనియర్ టిడిపి నాయకులు కుర్రా అప్పారావు నియామకానికి సిఎం చంద్రబాబు నాయుడు తన ఆమోదాన్ని తెలిపారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న మార్కెట్ కమిటీలకు పాలక మండళ్ళ ఎంపికలో భాగంగా శుక్రవారం ఆయా జాబితాలను ఖరారు చేశారు. ఇందులో భాగంగా గుంటూరు మిర్చి యార్డు చైర్మన్‌గా అప్పారావును ఎంపిక చేశారు. 2023లో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఉమ్మడి గుంటూరు జిల్లాలో పాదయాత్ర చేసిన సందర్భంగా కుర్రా అప్పారావు తగిన సహాయ సహకారాలు అందించడంతో ఆయనకు గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ పదవిని కేటాయించారని పార్టీ వర్గాలు తెలిపాయి. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామంలో జన్మించిన ఆయన గత కొన్నేళ్లుగా గుంటూరులో నివాసం ఉంటున్నారు. పార్టీలో ఏ పదవి లేకపోయినా పలు కార్యక్రమాలకు హాజరు అవుతున్నారు. వివాద రహితుడుగా ఆయన్ను ఎంపిక చేశారు. ఏడాదికి ఆరు వేల కోట్ల టర్నోవర్ కలిగిన యార్డులో ఏడాది పొడవున క్రయ విక్రయాలు కొనసాగుతున్నాయి. రైతులతో నిత్య సంబంధాలు కలిగి ఉండే ఈ పదవి కోసం టిడిపిలో తీవ్ర పోటీ నెలకొనగా మంత్రి నారా లోకేష్ చొరవతో ఈ నియామకం జరిగినట్టు పార్టీ వర్గాలలో ప్రచారం జరుగుతోంది. మిర్చి యార్డు చైర్మన్ పదవిని ఆశించిన అనేక మంది టిడిపి, జనసేననాయకులు తీవ్ర నిరాశకు గురయ్యారు.


కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - మంగళగిరి

2024 ఎన్నికలకు ముందు మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి 17 రోజులు పాటు రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు సమ్మె చేశారు. సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని, వేతనం చెల్లించాలని, చెప్పులు, సబ్బులు, నూనెలు, యూనిఫామ్ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్పొరేషన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ ఎస్ చెంగయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. కనీస వేతనం అమలు జరపడం లేదని విమర్శించారు. అమలకు జీవోలు ఇవ్వడం జరిగిందని, ఆ జీవోలను కూడా అమలు చేయడం లేదని అన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్పొరేషన్ కమిషనర్ ఎస్ ఆలిం భాష ను కలిసి ఫెడరేషన్ నాయకులు వినతి పత్రం అందజేశారు.

నిమిదో రోజుకు చేరిన ఎం బుక్ కార్మికుల నిరసన దీక్ష

కార్పొరేషన్ కార్యాలయం ఎదుట తాడేపల్లి ఎం బుక్ కార్మికులు నైట్ డ్యూటీ కొనసాగించాలని కోరుతూ చేస్తున్న నిరసన దీక్ష శుక్రవారం నాటికి ఎనిమిదో రోజు చేరింది. ఈ సమస్యను పరిష్కరించాలని కమిషనర్ను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి వెంకటేశ్వర్లు, బి వెంగమ్మ, మంగళగిరి పట్టణ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు వై శివ నాగేశ్వరరావు, ఎం వెంకటేశ్వరమ్మ, ఎస్ నాగేశ్వరరావు, కే ఆరుద్రరావు, కే పార్వతీ, కనకదుర్గ, వాసంతి, ఎస్కే ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లు జనవరి 1 నుండి లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్‌ను 2026 జనవరి 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీలోపు జీవన్ ప్రామాన్ అప్లికేషన్ ద్వారా కానీ, జీవన్ ప్రమాన్ ఫేస్ అప్లికేషన్ ద్వారా కానీ సంబంధిత ఉపఖజానా కార్యాలయంలో సమర్పించాలని జిల్లా ఖజానా, లెక్కలు అధికారి ఎం.చంద్రశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బయోమెట్రిక్ (చేతి వేలిముద్రలు) సరిగ్గా లేనివారు, ఆరోగ్యం సరిగ్గా లేనివారు, మంచానికి పరిమితం అయినవారు సంబంధిత ఉప ఖజానా కార్యాలయంలో తెలియచేస్తే సంబంధిత ఖజానా సిబ్బంది పెన్షనర్ వద్దకు వచ్చి లైఫ్‌సర్టిఫికెట్‌ను ధ్రువీకరిస్తారని తెలిపారు. పెన్షనర్ల పాన్-ఆధార్ లింక్ చేసుకునేందుకు ఈ ఏడాది డిసెంబర్ 31తో గడువు ముగుస్తుందని, ఈ లోగా లింక్ చేయకపోతే పాన్ రద్దు అవుతుంది అని తెలిపారు.

లక్ష్మణచక్రవర్తికి లక్ష్మీనారాయణ సాహితీ పురస్కారం

ప్రజాశక్తి-గుంటూరు

ఉద్యోగ విధి నిర్వహణలోను, కుటుంబాన్ని విలువలతో తీర్చిదిద్దిన మహోన్నత వ్యక్తిత్వం గల వారు విశ్రాంత జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి కీర్తిశేషులు చెంచు లక్ష్మీనారాయణ అని విశ్రాంత రాష్ట్ర డిజిపి, రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్ ద్వారకా తిరుమలరావు అన్నారు. విద్యావేత్త, రచయిత్రి ప్రొఫెసర్ సిహెచ్ సుశీలమ్మ తమ తండ్రి పేరుతో ఇస్తున్న 'శ్రీ సిహెచ్ లక్ష్మీనారాయణ స్మారక సాహితీ పురస్కారం – 2025' తెలంగాణ విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ లక్ష్మణ చక్రవర్తికి అందించే కార్యక్రమం స్థానిక బందావన్ గార్డెన్స్, వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం, పద్మావతి కళ్యాణ వేదికపై శుక్రవారం నిర్వహించారు. సభకు ప్రొఫెసర్ అండ్ మేనేజ్మెంట్ కన్సల్టెంట్ డాక్టర్ ఎంసీదాస్ అధ్యక్షత వహించారు. మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావు మాట్లాడుతూ సాహిత్యం విలువలతో కూడిన సమాజ అభివద్ధికి దోహదం చేసేలా ఉండాలన్నారు. సాహిత్యాన్ని సరైన మార్గంలో నడిపించేందుకు విమర్శ చికిత్సచేసే వైద్యునిగా ఉండాలన్నారు. డాక్టర్ సుశీలమ్మ సాహిత్యంలో విమర్శనారంగాన్ని ఎంచుకొని తండ్రి పేరుతో ప్రముఖులను సత్కరించటం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ షేక్ అహ్మద్ షరీఫ్, ప్రముఖ సాహితి వేత్తలు డాక్టర్ పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ, డాక్టర్ భూసురుపల్లి వెంకటేశ్వర్లు, బండ్ల మాధవరావు, డాక్టర్ ఓరుగంటి వెంకటరమణ, మోదుగుల రవికృష్ణ తదితరులు పాల్గొన్నారు.


లక్ష్మణచక్రవర్తికి పురస్కారం అందచేస్తున్న ద్వారాకా తిరుమలరావు, సాహితీవేత్తలు



పంటకోతను పరిశీలిస్తున్న మురళీకృష్ణ, అమలకుమారి

ప్రకృతి వ్యవసాయం..

భూమికి పునరుజ్జీవనం

ప్రజాశక్తి - బొల్లాపల్లి (వినుకొండ)

ప్రకృతి వ్యవసాయంతో భూమికి పునర్జీవం లభిస్తుందని వినుకొండ మార్కెట్ యార్డు ఛైర్మన్ మీసాల మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని కోటప్పనగర్‌లో శుక్రవారం వరి పంటకోత ప్రయోగం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు. మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రధాన పంటకు ముందు 30 రకాల విత్తనాలు (పీఎండీఎస్) విత్తడం వల్ల భూమి ఆరోగ్యం మెరుగుపడిందని, ప్రతి రైతు ప్రక అతి వ్యవసాయ విధానాలను అనుసరించాలని పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె. అమలకుమారి మాట్లాడారు. కార్యక్రమంలో వినుకొండ మండల వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఏఈఓ హరీఫ్, వీఏఏ యశ్వంత్, ప్రక అతి వ్యవసాయ జిల్లా సిబ్బంది సైదయ్య, సౌజన్య, మండల సిబ్బంది శివలక్ష్మి, హనుమంతరావు, రైతులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామానికి చెందిన, బురుసు గురవయ్య (43) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. ప్రకాశం జిల్లా త్రిపురాంతకం ద్ద అక్టోబర్ 31న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ట్రాక్టర్‌ను కారు ఢీకొన్న సంఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ గురవయ్య తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలకు ఇనుప డ్రిల్ ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - అచ్చంపేట

పుట్లగూడెం గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో కోతుల బెడద ఇబ్బందులు గురవుతున్నారని పాఠశాల వరండాకు ఇనుప డ్రిల్ ఏర్పాటు చేయాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కోరారు. స్థానిక ఎమ్మెల్యే తలపెట్టిన వంద రోజులు 100 గ్రామాల కార్యక్రమంలో భాగంగా 23వ రోజు అచ్చంపేట మండల పరిధిలోని పుట్లగూడెం గ్రామంలో గ్రామ సభ శుక్రవారం నిర్వహించారు. పలు రకాల సమస్యలతో గ్రామస్తులు దరఖాస్తులను ఎమ్మెల్యేగా అందజేశారు. ఆయన వెంట రాష్ట్ర నాయకులు వెన్న సాంబశివరెడ్డి ఎంపీడీవో కె.శ్రీనివాసరావు. డిటి షేక్ జానీ బాషా, ఎంపీపీ భూక్య స్వర్ణమ్మ మండల పార్టీ అధ్యక్షులు నందిగా ఆశీర్వాదం. టిడిపి పార్టీ అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వంగవీటి ఆశయ సాధన కృషి చేయాలి

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ :

వంగవీటి మోహన రంగా ఆశయ సాధన కు యువత కఅషి చేయాలని మాచర్ల మండల జనసేన అధ్యక్షుడు గుండెబోయిన సాంబశివరావు అన్నారు.వంగవీటి మోహన రంగా 37వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం మాచర్ల పట్టణంలో ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం గుండెబోయిన సాంబశివరావు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం వంగవీటి రంగా చేసి కఅషి ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామిశెట్టి సైదారావు నాయుడు,గంధం మల్లయ్య, కొమెర లాలకృష్ణ, వెల్దండి శంకర్, జక్కా నరసింహారావు, రాచమల్ల నజూర్ యాదవ్, బత్తుల నరసింహ, సాయి కుమార్ నాయక్, జూంపాల సాయి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక పురపాలక సంఘం పరిధిలోని సచివాలయాలను శుక్రవారం నాడు మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా 15వ సచివాల యంలో డ్యూటీ చార్టును, అటెండెన్స్ బుక్‌ను పరిశీలించి ప్రభుత్వ ఆదేశించిన సర్వే పనులను త్వరతగతిన పూర్తి చేయాలని అదేవిధంగా వాటర్ ట్యాక్స్ వసూలు, ఇంటి పన్నులు వసూలు కూడా వేగవంతం చేయాలని సూచనలు చేశారు. అదే విధంగా ప్రజా ప్రతినిధులు ప్రజల నుంచి సచివాలయాలలో అందు బాటులో ఉండటం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని సచివాలయాల సిబ్బంది సమయపాలన పాటించాలని సర్వేల పేరుతో కార్యాలయంలో అందు బాటులో లేక పోతే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయాలకు సంబంధించిన పలు సూచనలు సచివాలయ సిబ్బందికి చేశారు.



సచివాలయాలను ఆకస్మికంగా తనికి చేసిన మున్సిపల్ కమిషనర్ పి. శ్రీ హరిబాబు

ప్రతి ఒక్క ఫిర్యాదు దారుని సమస్య పరిష్కరించాలి : డిఎస్‌పి



రికార్డులను తనిఖీ చేస్తున్న సత్తెనపల్లి డిఎస్‌పి హనుమంతరావు

ప్రజాశక్తి - నకరికల్లు

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్క ఫిర్యాదు దారుని సమస్యలను తెలుసుకుని పరిష్కరించే విధంగా పోలీసులు పని చేయాలని సత్తెనపల్లి డిఎస్‌పి మేదరమెట్ల హనుమంతరావు తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి హనుమంతరావు మాట్లాడుతూ గ్రామాలలో అల్లర్లు జరగకుండా నివారించడానికి ప్రతి గ్రామానికి ఒక్కొక్క పోలీసును కేటాయించామని తెలిపారు. అద్దంకి నార్కెట్ పల్లి రాష్ట్ర రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం చిలకలూరిపేట జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థులు మ అతి చెందిన సంఘటనలో బయటపడిన దొంగ కార్ల వ్యవహారంపై మాట్లాడుతూ ఫైనాన్సు సంస్థల్లో తీసుకొచ్చిన వాహనాలకు దొంగ నెంబర్ ప్లేట్లు, చాయిస్ నంబర్లు మార్చి వాహనాలను అమ్ముతున్నారని తెలిపారు. నకరికల్లు మండలంలో దొంగ ద్విచక్ర వాహనాలపై కొంతమంది తెలిపిన సమాచారం మేరకు వాటిపై కూడా పూర్తిస్థాయిలో విచారణ జరిపి వాహనాలను స్వాధీనం చేసుకుంటామన్నారు. తనిఖీలలో సత్తెనపల్లి రూరల్ సిఐ పి.కిరణ్, ఎస్ఐ. కె.సతీష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జనవరి నుంచి అందుబాటులోకి పాలువాయిగేట్ ఆరోఓబి

ప్రజాశక్తి - రెంటచింతల

167 ఏడీ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పాలువాయిగేట్ నిర్మిస్తున్న ఆర్వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి) పనులు ంండు రోజుల నుంచి ముమ్మరంగా జరుగుతున్నాయి. పది నెలల నుంచి రైల్వే శాఖ అనుమతులు రావడం జాప్యం జరగడంతో ఆర్వోబీకి ఇరువైపులా జాతీయ రహదారి నిర్మాణం మాత్రమే పూర్తి చేశారు. భారీ క్రేన్లతో గడ్డర్లను రైలు పట్టాలపై ఏర్పాటు చేసే పనులు శుక్రవారం ఉదయం ప్రారంభించి సాయంత్రం కల్లా పూర్తి చేశారు.అందులో భాగంగా 6 గడ్డర్లను పట్టాలపైన అమర్చారు. ఒక్కో గడ్డర్ పొడవు 36 మీటర్ల పొడవు, 1 మీటర్ వెడల్పుతో ఏర్పాటు చేశారు. దీనిపై నిర్మించిన రహదారి 96 మీటర్లు పొడవు 12 మీటర్ల వెడల్పుతో నిర్మించారు.. ఒక్కో గడ్డరు బరవు 37 టన్నుల దాకా ఉంది. పది రోజుల్లో గడ్డర్లపై వేసే సిమెంట్ కాంక్రీట్ పూర్తవుతుందని తరువాత వాహనాల రాకపోకలకు అనుమతి ఇవ్వనున్నా రు. రైలు గేట్ పడినప్పుడల్లా ఇరువైపులా బారులు తీరి నిమిషాల తరబడి వాహనాలు నిలిచిపోయే ఇక్కట్లు జనవరి నుంచి తప్పనున్నాయి. నేషనల్ హైవే ఈఈ శ్రీనివాస్, ఏఈ ప్రకాశంలు రైల్వే అధికారుల సమన్వయంతో గడ్డర్ల ఏర్పాట్లను పూర్తి చేశారు.



పాలువాయిగేట్‌లో రైలు పట్టాలపై ఏర్పాటు చేసిన గడ్డర్లు

తెలుగు రాజకీయాల్లో రంగా స్థానం ప్రత్యేకం

ప్రజాశక్తి - రాజుపాలెం

తెలుగు రాజకీయాలని శాసించిన శక్తి స్వర్గీయ వంగవీటి మోహనరంగా అని టీడీపీ సీనియర్ నేత,మండల కాపు సంఘ అధ్యక్షుడు పులిబండ్ల సాంబశివరావు అన్నారు. శుక్రవారం వంగవీటి మోహన రంగా వర్ధంతి నిర్వహించారు. రంగా చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సఖినాల వలరాజు,చౌక్కా శ్రీనివాసరావు, జెట్టి కోటేశ్వరరావు, చౌక్కా రాంబాబు, రాజుపాలెం జన సేన పార్టీ అధ్యక్షుడు నారపుశెట్టి కోటేశ్వరరావు, తోట సుభాష్,దూడుకు నాగేశ్వరరావు,లేబాకుల బ్రహ్మయ్య, పొత్తూరి రామకృష్ణ, బొమ్మిశెట్టి సీతా, జాన్సన్, చౌక్కా వెంకటప్పయ్య, కేదారి నాగేశ్వరరావు, గాసి శ్రీనివాసరావు, కొజ్జా వెంకటేశ్వర్లు, గుడిమెట్ల సాంబయ్య, గుమ్మా పుల్లయ్య, వాసా నాగేశ్వరరావు, జలపాటి సోమయ్య, దూడుకు శ్రీనివాసరావు, గంగాధరీ పరమేశ్వరరావు, పెండ్యాల నాగేశ్వరరావు, దండే భాగ్యలరావు,దండే రాజశేఖర్, కూటమి నేతలు,కాపు సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ప్రజా సమస్యల పోరాటానికై తన ప్రాణాలను సైతం అర్పించిన. మహనీయుడు స్వర్గీయ వంగవీటి మోహనరంగా అని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. రంగా వర్ధంతి సందరరేగా వడ్డవల్లి పోలేరమ్మ తల్లి గుడి వద్ద ఉన్న రంగా విగ్రహానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం. పేద మహిళలకు చీరలు పంపిణ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు బుడగాల సుబ్బారావు, కంబాల వెంకటేశ్వరావు , పాపిశెట్టి బాలచంద్రరావు, తవిటి భావన్నారాయణ, పెద్దింటి వెంకటేశ్వరరావు, నాయకులు తదితరులు పాల్గన్నారు.

ప్రజాశక్తి - అచ్చంపేట

పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి వంగవీటి రంగా చేసిన కృషి ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలన్న స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు శుక్రవారం అచ్చంపేటలోని వంగవీటి రంగా వర్ధంతి వేడుకల్లో పాల్గొని రంగ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాపు మండల కాపు సంఘం అధ్యక్షులు గంధం కోటేశ్వరావు తోపాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన కాపు సంఘ నాయకులు రంగా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

నేడే కాశిపాడులో ఎమ్మెల్యే భాష్యం పర్యటన

మండలంలోని కాశిపాడులో శనివారం ప్రజల వద్దకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కార్యక్రమం జరుగుతుందని మండల టిడిపి అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు.



సావిత్రి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సభ్యులు

ఘనంగా మహానటి సావిత్రి వర్ధంతి

ప్రజాశక్తి - సత్తెనపల్లిటౌన్

మహానటి సావిత్రి 44వ వర్ధంతి కార్యక్రమాన్ని కంఠంనేని వెంకట సాంబశివరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ సినీ పరిశ్రమలో తన హావభావాలతో ప్రేక్షక హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న ఘనత సావిత్రికే దక్కుతుంది అన్నారు. ముందుగా సీనియర్ రంగస్థల నటుడు ముట్టెం రాంబాబు బత్తిన వెంకట లక్ష్మయ్యలు సావిత్రి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఫొటో స్టూడియో అసోసియేషన్ నాయకులు జవ్వంగుల శ్రీనివాస్, ప్రజానాట్య మండలి పట్టణ గౌరవ అధ్యక్షులు కంబాల శ్రీనివాస్, కార్యదర్శి చిన్నకేశవులు ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్డ్ సంఘ ఉపాధ్యక్షులు అంకాళ్ళ ప్రభుదాస్, కె.నాగేశ్వరావు, దావీదు తదితరులు పాల్గొన్నారు.



నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నూతన వస్త్రాలు పంపిణీ

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

పట్టణ శివారులోని లెప్రసి కాలనీలో ఖమ్మం గ్రేస్ సర్వీస్ సొసైటి వారు కాలనీలోని 27 కుటుంబాలకు బియ్యం, నూతన వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విఆర్ఓ ఎన్. వెంకట్రావ్ మాట్లాడుతూ గ్రేస్ సర్వీస్ సొసైటి వారు చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. సంస్థ ప్రతినిధి రమేష్ మాట్లాడుతూ గత కొన్న సంవత్సరాలుగా సంస్థ వారు చేస్తున్నటువంటి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి పర్యటన

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని బుచ్యయపాలెం గ్రామంలో విస్తఅతంగా పర్యటించారు. శుక్రవారం ఆ గ్రామంలోని శ్రీ పోలేరమ్మ తల్లి మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం వార్షికోత్సవం నిర్వహించారు. ప్రజల యొక్క యోగక్షేమాలను, అందుతున్న పథకాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల టిడిపి మాజీ అధ్యక్షులు మరియు జిల్లా కార్యదర్శి రమేష్, సీనియర్ నాయకులు భాష్యం ఆంజనేయులు, మద్దినేని సత్యం, పరుచూరి పూర్ణచంద్రరావు, ఘట్టమనేని భాస్కరరావు ఇంకా పలువురు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పని చేయాలి

ప్రజాశక్తి - పెదకూరపాడు

పదవులు వచ్చిన వారందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ కోరారు. శుక్రవారం నియోజకవర్గ శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్‌ని జిల్లా టిడిపి ఉపాధ్యక్షురాలుగా నూతనంగా నియమించబడిన షేక్ ముంతాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. తనకి అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కష్టపడ్డ ప్రతి ఒక్క నాయకులకు అవకాశం కల్పించి మంచి మంచి పదవులు అందిస్తూ కులాలకు మతాలకతీతంగా ప్రతి ఒక్కరికి పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఏటుకూరు బ్రహ్మయ్య, సొసైటీ చైర్మన్ ఏటుకూరు రత్నకుమార్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ వెన్న సాంబిరెడ్డి, మాజీ మార్కెట్ యాడ్ చైర్మన్ రామగోపాల్ రావు, మాజీ ఎంపీపీ గల్ల బాబురావు,డీసీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, మైనారిటీ నాయకులు మస్తాన్ షరీఫ్, దిలీప్, మలాట్ రఫీ ముస్లిం మైనార్టీ పెద్దలు టిడిపి అభిమానులు పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

బస్సు షెల్టర్ నిర్మించాలని సంతకాల సేకణ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని శ్రీలక్ష్మి నరసింహ స్వామి కాలనీ బస్ స్టాప్ వద్ద షెల్టర్ నిర్మించాలని కోరుతూ సిపిఎం 22వ వార్డు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సంతకాలు సేకరించారు. బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. సమస్యను పరిష్కరించాలని మంగళగిరి తాడేపల్లి నగరపాల సంస్థ కార్పొరేషన్ కమిషనర్, స్థానిక సచివాలయ అడ్మిన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు పంపినట్లుగా సిపిఎం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు పి.బాలకృష్ణ, జె.శివ భావన్నారాయణ, బి.స్వామినాథ్, జి.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

రాధాకు సత్కారం

ప్రజాశక్తి- తాడేపల్లి



మహానాడులో రాధా రంగా మిత్రమండలి ఆటో యూనియన్ సహకారంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న రంగా తనయుడు యువనేత వంగవీటి రాధాను జనసేన యువజన నాయకులు జొన్నా రాజేష్, తాడేపల్లి టౌన్ అధ్యక్షులు అంబటి తిరుపతిరావు శుక్రవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ తెలుగుదేశం నేత తోట సాంబశివరావు పాల్గొన్నారు.

విధి ఎంత విచిత్రం..

నిన్న సన్మానం... నేడు శ్రద్ధాంజలి

ప్రజాశక్తి - మంగళగిరి



మనిషికి ఏ క్షణానికి ఏమవుతుందో ఎవరికి తెలియదు. 100వ సంవత్సరంలోకి అడుగు పెట్టబోతున్న ఓ రిటైర్డ్ పాస్టర్‌ను క్రిస్మస్ పర్వదినాన ఘనంగా సత్కరించాడు ఓ నాయకుడు. తిరిగి మరుసటి రోజు ఆ పెద్దాయన ప్రభువు సన్నిధిలో నిద్రించాడు అనే చెదు వార్తతో అదే నాయకుడు శ్రద్ధాంజలి ఘటిస్తూ పూలమాలవేయటం చూస్తే విధి ఎంత విచిత్రంగా ఉంటుందనే భావన ప్రతి ఒక్కరి మదిలో మసులుతుంది. ఆ విషాద ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళగిరి మన్నెం వారి వీధిలో ఉంటున్న 99 సంవత్సరాలు వయసు ఉన్న రిటైర్డ్ పాస్టర్ ఆనందరావును క్రిస్మస్ సందరరేగా గురువారం మధ్యాహ్నం స్థానిక మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మన్నెం రమేష్ బాబు ఘనంగా సత్కరించి నూతన వస్త్రాలు, పండ్లు అందజేశారు. సంతోషపడిన ఆనందరావు రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు.





సుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న రఘునాథ బాబు తదితరులు, సుబ్రహ్మణ్యంతో రైతు సంఘం నాయకులు

ఘనంగా కుమార్ పంప్స్ అధినేత జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - తెనాలి

కుమార్ పంప్స్ అధినేత, ప్రముఖ పారిశ్రామికవేత్త కొత్త సుబ్రహ్మణ్యం జన్మదిన వేడుకలను సుల్తానాబాద్ లోని ఇండస్ట్రియల్ ఎస్టేట్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 75వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందరరేగా పలువురు వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, కుమార్ పంప్స్ ఉద్యోగ వర్గాలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపాయి. తొలుత ఆయన కుటుంబ సభ్యులతో కలిసి పుట్టినరోజు కేక్ కట్ చేశారు. అనంతరం ఎస్టేట్లో కుమార్ పంప్స్ ఉద్యోగులతో సందర్శకులతో కలిసి కొంత సమయం సరదాగా గడిపారు. ఈ సందర్భంగా బిజెపి నేత ఎడ్లపాటి రఘునాథ బాబు, ఎఎస్ ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామ్‌చంద్, వియస్సార్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ డివియల్ సోమయ్య శాస్త్రి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి, డివిజన్ నాయకులు మాగంటి ఎల్లమందయ్య, తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు. భవిష్యత్తులో రైతులకు, కార్మికులకు ఉపయోగపడే విధంగా అనేక మంచి కార్యక్రమాలు చేపట్టాలని వారు ఆకాంక్షించారు.

పోలీసుల చర్యకు నిరసనగా న్యాయవాదులు విధుల బహిష్కరణ

ప్రజాశక్తి - తెనాలి

నిందితుడి అరెస్ట్ క్రమంలో పోలీసుల తీరును నిరసిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. అధ్యక్షులు బేతాళ ప్రభాకర్ వెల్లడించిన వివరాల ప్రకారం పత్తికొండ కోర్టు హాల్ నుండి బయటకు వస్తున్న ఓ కేసులో నిందితుడిని న్యాయమూర్తి, న్యాయవాదులు చూస్తుండగానే బలవంతంగా పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తున్నట్లు చెప్పారు. నిందితుడిని అరెస్టు చేయడానికి చట్టంలో నిబంధనలు ఉన్నాయని సాక్షాత్తు కోర్టు ఆవరణలో పోలీసులు దానిని విస్మరించి దూకుడుగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిరసనలో అసోసియేషన్ కార్యదర్శి గౌరీ శంకర్, ఉపాధ్యక్షులు అన్నం పిన్నారావు, సీనియర్ న్యాయ వాదులు తాడిబోయిన శ్రీనివాసరావు, మద్ది మల్లికార్జున రావు, జి.జయరామకృష్ణ, జి.రవిరాజు పూర్ణరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

పరిమితికి మించిన వేగం తగదు

ప్రజాశక్తి - తెనాలి

పరిమితికి మించిన వేగం, ర్యాష్ డ్రైవింగ్ ప్రమాదకరమని, దానిని నియంత్రించడంలో అవసరమైతే వాహనాలను సీజ్ చేస్తామని పట్టణ త్రి టౌన్ సిఐ ఎస్ సాంబశివరావు హెచ్చరించారు. తెనాలి విజయవాడ మార్గంలో తెనాలి బండ్ వద్ద గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. అధిక వేగంతో వాహనాలు నడపడంతో పాటు, సైలెన్సర్లు తీసి నడపడం, ఎలాంటి పత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్న వారు పోలీసులకు పట్టుబడ్డారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. తెనాలి విజయవాడ మార్గంలో కొందరు యువకులు అధిక స్పీడుతో వెళుతూ పట్టుబడ్డారని చెప్పారు. పట్టుబడిన వాహన చోధకులలో కొందరు వాహన పత్రాలు, లైసెన్సులు లేని వారు ఉన్నారని, నిబంధనల మేరకు వారికి అపరాధ రుసుము విధిస్తామన్నారు. పోలీసుల తనిఖీలను దృష్టిలో ఉంచుకొని కొందరు వెనుతిరిగి వెళ్లే ప్రయత్నంలో ప్రమాదాలకు గురయ్యే ఆస్కారం ఉందన్నారు. వాహనాలను పరిమితికి తగినట్లుగా రవాణా శాఖ నిబంధనల మేరకు నడిపి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎస్ఐలు, ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఘనంగా వంగవీటి మోహన రంగా వర్ధంతి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్


విజయవాడ కాంగ్రెస్ తూర్పు నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు వంగవీటి మోహన రంగా 37వ వర్ధంతి కార్యక్రమం ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి గ్రామంలో కూటమి పార్టీలైన టిడిపి జనసేన పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం జరిగింది. గ్రామంలోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద, ప్రాతూరు రోడ్డు వద్ద ఉన్న రంగా విగ్రహానికి రెండు ప్రాంతాలలో టిడిపి కుంచనపల్లి గ్రామ అధ్యక్షులు కానుగోలు కోటేశ్వరరావు, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు మేకల రాజా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో జనసేన నాయకులు పసుపులేటి అశోక్, మున్నా శ్రీను, తోటకూర ప్రవీణ్, బొడ్డు మహేంద్ర, బాకీ బాలు, కొవ్వూరి సురేష్, అమ్మిశెట్టి నరేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

బడుగు, బలహీన వర్గాల నాయకుడు దివంగత స్వర్గీయ వంగవీటి మోహన రంగా ఆశయాల సాధన కోసం కృషి చేస్తామని కాపు సంఘం నాయకులు స్పష్టం చేశారు. మంగళగిరి నియోజకవర్గ కాపు సంఘం ఆధ్వర్యంలో వంగవీటి మోహన రంగా 37వ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మంగళగిరి -తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఉన్న వంగవీటి విగ్రహానికి పూలమాలలు వేసి కాపు సంఘం నాయకులు నివాళులు అర్పించారు. కాపు కార్పొరేషన్ డైరెక్టర్ విన్నకోట శ్రీనివాసరావు, జై కాపునాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, కాపు సంఘం మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు తిరుమల శెట్టి కొండలరావు మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అనిల్ బాబు, శివ నాగేంద్రం, నారిశెట్టి చంద్రశేఖర్, కాపు సంఘం నాయకులు తులం సాంబశివ రావు, ఇండ్ల సత్యం, బత్తుల గణపతి, యుగంధర్, పోతన చిరంజీవి, నాగేశ్వరరావు, రంగిశెట్టి పెద్దబ్బాయి పాల్గన్నారు.

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక రైల్వే స్టేషన్ సెంటర్లో మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా 37వ వర్ధంతిని అభిమానులు సాయి గోపి, అక్బర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. తొలుత రంగా విగ్రహానికి నివాళులర్పించారు.



కుంచనపల్లిలో రంగా విగ్రహానికి వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కార్యక్రమంలో నాయకులు చల్లా పుల్లారావు, తోటకూర వెంకటరమణ రావు, మహమ్మద్ కుద్దూస్, గాజుల విజయసారధి, ఎం. సుబ్రమణ్యం, హరిదాసు గౌరీ శంకర్, పి త్రిమూర్తులు, సినీ మాటలు రచయిత బుర్ర సాయి మాధవ్, సుద్దపల్లి నాగరాజు, గ్యాలం వేణు, వల్లెం మురళి, ఎ.సాంబశివరావు, టి.సుబ్రహ్మణ్యం, ఎ.అనిల్ కుమార్ పాల్గొన్నారు. స్థానిక రామలింగేశ్వరపేటలో రంగా విగ్రహానికి పలువురు జనసేన నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పసుపులేటి మురళీకృష్ణ, మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ జాకీర్ హుస్సేన్, వక్ఫ్ బోర్డ్డైరెక్టర్ షేక్ ఇస్మాయిల్ బేగ్, రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమల శాఖ డైరెక్టర్ బండారు రవికాంత్, తెనాలి అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బచ్చు శ్రీనివాస్ పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

వెయ్యి మందికి అన్నదానం

ప్రజాశక్తి- తాడేపల్లి

వంగవీటి మోహనరంగా వర్ధంతి సందర్భంగా శుక్రవారం తాడేపల్లి మహానాడు వద్ద రాధా రంగా మిత్రమండలి, ప్రజా కాపునాడు ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగా 37 వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెయ్యి మందికి అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో వంగవీటి మోహన రంగా తనయుడు వంగవీటి రాధా ముఖ్య అతిథులుగా పాల్గొని రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత గుంటూరు పార్లమెంటు ఉపాధ్యక్షులు జంగాల వెంకటేష్,జనసేన పార్టీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు అంబటి తిరుపతిరావు, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు టంకశాల ఈశ్వర్ నాయుడు,జంగాల సాంబశివరావు,రాధా రంగా మిత్రమండలి,ప్రజా కాపునాడు నాయకులు, జొన్నా రాజేష్, తోట సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

శివాలయం హుండీల లెక్కింపు

ప్రజాశక్తి - పెదకాకాని

స్థానిక మల్లేశ్వరస్వామి వారి దేవస్థానములో శుక్రవారం కానుకల హుండీలను తెరిచి లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ ఉప ఎమిషనర్, కార్యనిర్వహణాధికారి గోగినేని లీలాకుమార్ మాట్లాడుతూ హుండీల లెక్కింపునకు దేవదాయశాఖ పర్యవేక్షణాధికారిగా లాలాపేట గ్రూపు దేవస్థానముల సహాయకమిషనరు పెళ్లూరి సుభద్ర పర్యవేక్షించారని, దేవస్థానమునకు గడిచిన 71 రోజుల కానుకల హుండీల ద్వారా రూ.64,18,291/-లు, అన్నదానం హుండీ ద్వారా రూ.7,80,953/-లు, బంగారం 0.043.190మి.గ్రా,వెండి 0.364.200 గ్రాములు, 3 ఆమెరికన్ డాలర్సు హుండీ ద్వారా ఆదాయం వచ్చినట్లు

పడవల కాలువలో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి - తెనాలి



పట్టణంలోని పడవల కాలువలో గుర్తుతెలియని మ అతదేహంపై పోలీసులకు అందిన సమాచారంతో పోలీసులు దానిని వెలికి తీసి పరిశీలించారు. మ అతుని వయసు సుమారు 40 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఒంటిపై ఎలాంటి అనుమానాస్పద గాయాలు లేవని, పోస్టుమార్టం నిమిత్తం మృదేహాన్ని జిల్లా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ సీఐ ఎస్ సాంబశివరావు తెలిపారు. ఆనవాళ్లు గుర్తించిన వారు పోలీసులను సంప్రదించాల్సిందిగా కోరారు.



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

388వ రోజుకు చేరిన కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

చట్ట ప్రకారం తమకు రావాల్సిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శుక్రవారం నాటికి 388వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సిఐటియూ పట్టణ కార్యదర్శి వి.దుర్గారావు, కార్మికుల యూనియన్ నాయకుడు స్టీవెన్, ఆదినారాయణ, వై.సాంబశివరావు, అంకయ్య ప్రారంభించారు. దీక్షల్లో దేరంగుల రమణమ్మ, మొలక శారదా, వేము రిబ్కా, వేముల లక్ష్మి, జి. అన్నమ్మ కూర్చున్నారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న లావు రత్తయ్య, తదితరులు

విజ్ఞాన్స్ వర్సిటీలో పరిశోధనా కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - గుంటూరు

వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో రెండు అత్యాధునిక పరిశోధనా కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ నానో సైన్స్, ఎనర్జీ మెటీరియల్స్, సెన్సార్ టెక్నాలజీ రంగాల్లో పరిశోధనలను ప్రోత్సహించే లక్ష్యంతో రామన్ సెన్సర్ సెంటర్, డాక్టర్ లావు రత్తయ్య సెంటర్ ఫర్ ఎనర్జీ మెటీరియల్స్ కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. రామన్ సెన్సర్ సెంటర్ ద్వారా నానో సైన్స్‌ను సాంకేతిక అనువర్తనాలుగా మార్చే దిశగా విస్తృత పరిశోధనలు సాగనున్నాయని చెప్పారు. ఈ కేంద్రంలో ఆధునిక సెన్సార్ టెక్నాలజీలు, నానో డివైసెస్, స్మార్ట్ ఇంజినీరింగ్ అంశాలపై పరిశోధనలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, పరిశ్రమల భద్రత వంటి కీలక రంగాల్లో వినూత్న సాంకేతిక పరిష్కారాల అభివృద్ధికి ఈకేంద్రం దోహదపడనుందని వెల్లడించారు. డాక్టర్ లావు రత్తయ్య సెంటర్ ఫర్ ఎనర్జీ మెటీరియల్స్ (డాక్టర్ లారాసీఈఎం) ద్వారా ఎనర్జీ సంబంధిత పదార్థాలు, పునరుత్పాదక శక్తి వనరులు, బ్యాటరీ టెక్నాలజీ, ఎనర్జీ స్టోరేజ్ మెటీరియల్స్‌పై లోతైన పరిశోధనలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవ రాయలు, చాన్స్‌లర్ డాక్టర్ పావులూరు సుబ్బారావు, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి పాల్గొన్నారు.



బాధితులకు సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందచేత

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలో పలువురు వ్యక్తులు పోగొట్టుకున్న దొంగిలించబడిన సెల్‌ఫోన్లను జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ తిరిగి బాధితులకు అందచేశారు. గత రెండేళ్ల కాలంలో సుమారు రూ.7 కోట్ల 53 లక్షల విలువైన మొత్తం 3,769 మొబైల్ ఫోన్లను విజయవంతంగా రికవరీ చేసి బాధితులకు అందజేశారు. తాజాగా శుక్రవారం గత కొన్ని నెలలుగా తస్కరణకు గురైన, పోగొట్టుకున్న రూ.53 లక్షల విలువైన 265 పోగొట్టుకున్న దొంగిలించబడిన సెల్‌ఫోన్లను తిరిగి స్వాధీనం చేసుకుని ఎస్‌పి బాధితులకు అప్పగించారు. సెల్‌ఫోన్ల రికవరీ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని ఆయన తెలిపారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా లేదా దొంగిలించబడినా వెంటనే పోలీస్ హెల్ప్‌లైన్ నెంబర్ 8688831574, లేదా **CEIR** వెబ్‌సైట్, లేదా జిల్లా సైబర్ సెల్, లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సెల్‌ఫోన్లను ఉపయోగించి సైబర్ నేరగాళ్లు అధిక లాభాలు, ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలు వంటి ఆశలు చూపుతూ ప్రజలను మోసం చేసి వారి బ్యాంక్ ఖాతాల నుండి నగదు దోచుకుంటున్నారని తెలిపారు. ఇలాంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఫోన్ కాల్స్ వచ్చిన వెంటనే వాటిని బ్లాక్ చేసి సమీప పోలీస్ స్టేషన్‌లో గానీ, లేదా జాతీయ సైబర్ భద్రత టోల్ ఫ్రీ నెంబర్ 1930 కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఐటి కోర్ సిఐ నిషార్ భాష, కానిస్టేబుళ్లు శ్రీధర్ , మానస, ఇమామ్, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ కరీముల్లా ను ఎస్‌పి అభినందించారు.

నేడు విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక గ్రీవెన్స్

ప్రజాశక్తి - గుంటూరు

విభిన్న ప్రతిభావంతుల కోసం నేడు కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక గ్రీవెన్స్ జరుగుతుందని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు డి.దుర్గాభాయి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం ప్రతి నెలా 4వ శనివారం విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ జరుగుతుందన్నారు. కావున జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌ను వినియోగించుకోవాలని సూచించారు.

అమరావతిలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన కెవిపిఎస్, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహం, స్మృతివనం ఏర్పాటుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు ప్రారంభించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జ.నవీన్ ప్రకాష్, సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్యరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం రాజధాని ప్రాంతం తుళ్లూరులోని సిఐటియు కార్యాలయంలో నవీన్ ప్రకాష్, భాగ్యరాజు మాట్లాడుతూ, టిడిపి ప్రభుత్వం 2017లో రాజధానిలోని శాఖమూరు వద్ద 50 ఎకరాలలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం, స్మృతివనం, ఆడిటోరియం, పరిశోధనా కేంద్రం తదితర నిర్మాణాలను చేపడతామని ఆరాటంగా ప్రకటించిందని అన్నారు. నాడు చెప్పిన మాటలు నేటికీ ఆచరణలో కనబడటం లేదన్నారు.టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పైగా గడిచినా ప్రభుత్వం విగ్రహం, స్మ అతివనం ఊసే ఎత్తడం లేదన్నారు. వైసిపి ప్రభుత్వం



మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి నవీన్ ప్రకాష్, భాగ్యరాజు

రాజధానిని మార్చకుండా ముఖ్య భూమిక పోషించిన రాజ్యాంగం రూపశిల్పి అంబేద్కర్ విగ్రహం ఏర్పాటులో ప్రభుత్వానికి ఎందుకింత నిర్లక్ష్యమని వారు ప్రశ్నించారు. రాజధానిలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సంతోషమేనని, అంబేద్కర్, మహాత్మా గాంధీ విగ్రహాల ఏర్పాటుపై ప్రభుత్వం శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు ప్రదేశంలో పిచ్చిచెట్లు పెరుగుతున్నాయన్నారు. రాజధానిలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటే కాకుండా దళితులు,పేదలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పన లోనూ ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడు తోందన్నారు. రాజధాని నిర్మాణ పనుల్లో స్థానికులకు అవకాశం లేకుండా పోయిందన్నారు. రాజధాని నిర్మాణ పనుల్లో ఉన్న వేలమంది కార్మికులలో స్థానికులు ఎంతమంది ఉన్నారో ప్రభుత్వం చెప్పాలన్నారు. రైతులకు ట్రాక్టర్లు,కార్లు ఉన్నాయని,వాటిని నిర్మాణ పనుల్లో వినియోగించుకోవడం లేదన్నారు.రాజధాని నిర్మాణ బాధ్యత నుంచి కేంద్ర ప్రభుత్వం తప్పుకొని నిధులు ఇవ్వకుండా అప్పులకు మాత్రమే సాయం చేస్తామని అనడం వల్లనే నిర్మాణ పనులు అనుకున్నంత వేగంగా జరగడం లేదని అన్నారు.రాష్ట్ర రాజధాని అమరావతే నని కేంద్ర ప్రభుత్వం చట్టం తీసుకురాకుండా తాత్సారం చేస్తోందని మండిపడ్డారు.

వైద్యరంగంలో పిపిపి విధానమే పెద్ద స్కామ్

ప్రజాశక్తి - గుంటూరు

వైద్య రంగాన్ని పిపిపి విధానంలో కొనసాగించడం అతి పెద్ద స్కాంగా మారబోతుందని ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ నాయకులు అన్నారు. శుక్రవారం జన చైతన్య వేదిక హాలులో నిర్వహించిన మీడియా సమావేశంలో కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, కో - కన్వీనర్లు కె.ఎస్ లక్ష్మణరావు, వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, కొరివి వినయకుమార్, జన చైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.ధనుంజయ రెడ్డి పాల్గొన్నారు. ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పిపిపి పద్ధతిలో నిర్మించి నిర్వహించడం వలన ఆ భారం రోగులపై, వైద్య విద్యార్థులపై పడుతుందని, పిపిపి విధానంలో నిర్మించే విమానాశ్రయాలు, రహదారులతో వైద్యరంగాన్ని పోల్చకూడదని తెలిపారు. 4 ప్రభుత్వ వైద్య కళాశాలలకు రెండు పర్యాయాల టెండర్ల ప్రక్రియను నిర్వహించినా కేవలం ఒకే ఒక్క బిడ్ రావడానికి ప్రజా వ్యతిరేఖతగా భావించి రాష్ట్ర ముఖ్యమంత్రి పిపిపి విధానానికి స్వస్తి పలకాలని కోరారు. ఉద్యోగాలలో రాజ్యాంగ పరమైన రిజర్వేషన్లను పరోక్షంగా అంతమొందించటానికే చంద్రబాబు నాయుడు పిపిపి విధానం పట్ల అమిత ప్రేమను కనబరుస్తున్నారని విమర్శించారు. కె.ఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పీపీపీ పద్ధతిలో నిర్వహించ తలపెట్టిన వైద్య కళాశాలలకు ఇప్పటికే అందిస్తున్న భూములు, వసతులు, సిబ్బందికి రెండేళ్లపాటు వేతనాలు చెల్లించడమేకాక అదనంగా వయబిలిటీ గ్యాప్ ఫండ్ పేరుతో అనుయాయులకు లబ్ధి చేకూర్చడం దేశంలో మరెక్కడా లేదని విమర్శించారు. వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పిపిపి పద్ధతిలో ప్రైవేట్ యాజమాన్యానికి ఇచ్చిన దాఖలాలు లేవన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు

కొరివి వినయ కుమార్, జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.ధనుంజయరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో నిరంతరం నష్టాన్ని చవిచూస్తున్న రైతులకు వయాబిలిటీ గ్యాప్ ఫండ్ వర్తింప చేయగలరా అని ప్రశ్నించారు. జనవరి 9న విజయవాడలోని ధర్నా చౌక్‌లో జరిగే సామూహిక నిరసన దీక్షను పెద్ద ఎత్తున నిర్వహించి ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వానికి తెలియజేయాలని నాయకులు పిలుపునిచ్చారు. పిపిపి విధానాన్ని వ్యతిరేకించే అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన సంఘాలు, బహుజన సంఘాలు భాగస్వామ్యులై సామూహిక నిరసన దీక్షను విజయవంతం చేయాలని కోరారు.

సాంబశివరావు సంస్మరణ కార్యక్రమానికి ప్రముఖుల హాజరు

ప్రజాశక్తి - గుంటూరు





ప్రముఖ పోస్టల్ అండ్ టెలికం ఉద్యోగ సంఘ నాయకులు, టివి 9 మేనేజింగ్ ఎడిటర్ రజనీకాంత్ తండ్రి వెల్లలచెరువు సాంబశివరావు సంస్మరణ కార్యక్రమం శుక్రవారం గుంటూరులోని శ్రీ కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన పలువురు రాజకీయ ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తెలంగాణ మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీధర్‌బాబు హాజరయ్యారు. అదే విధంగా కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కన్నా లక్ష్మీనారాయణ, ప్రత్తిపాటి పుల్లారావు, భాష్యం ప్రవీణ్, జూలకంటి బ్రహ్మారెడ్డి, బి.రామాంజనేయులు, జివి ఆంజనేయులు, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, మాజీ మంత్రి అంబటి రాంబాబు, పేర్ని నాని, ఎంపి కృష్ణదేవరాయలు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వర రావు, సిహెచ్. బాబురావు, జిల్లా కార్యదర్శి వై.నేతాజి, కాంగ్రెస్, బిజెపి, జనసేన వివిధ పార్టీల నాయకులు, సంస్థల ప్రతినిధులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన వారు హాజరై సాంబశివరావు చిత్రపటానికి పూలు వేసి నివాళి అర్పించారు. రజనీకాంత్ కుటుంబ సభ్యులను పలుకరించి సానుభూతి తెలిపారు.

రూ.20.95 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం



సమావేశంలో పాల్గొన్న మేయర్, కమిషనర్, సభ్యులు

ప్రజాశక్తి - గుంటూరు : గుంటూరు నగరంలో రూ.20.95 కోట్లతో పలు డివిజన్లలో అభివృద్ధి పనులు నిర్వహణకు గుంటూరు నగరపాలక సంస్థ స్థాయిసంఘం ఆమోదం తెలిపింది. స్థాయి సంఘం అధ్యక్షులు, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అధ్యక్షతన శుక్రవారం స్థాయి సంఘం సమావేశంలో జిఎంసి కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి నిర్వహించారు. నగరంలోని ఆయా డివిజన్లకు సంబంధించిన ప్రజాప్రతినిధులు, జిఎంసి అధికారులు ప్రతిపాదించిన 60 అంశాలకు సంబంధించిన అభివృద్ధి పనులను స్థాయి సంఘ సభ్యులు, అధికారులతో చర్చించి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ ఆదాయం పెంచటానికి జిఎంసి షాపింగ్ కాంప్లెక్స్‌లలో ఖాళీలు ఉన్న షాపులకు నిబంధనల ప్రకారం బహిరంగ వేలం నిర్వహించటానికి అనుమతించినట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారుల పరిశీలనలో గుర్తించిన ప్రజాసమస్యల పరిష్కారంలో భాగంగా డివిజన్ల వారీగా ప్రాధాన్యత క్రమంలో సి.సి రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణాలకు, విలీన గ్రామాల్లోనూ నూతనంగా సిసి డ్రెయిన్లు, రోడ్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపామన్నారు. సమావేశంలో స్థాయిసంఘ సభ్యులు ఈరంటి వర ప్రసాద్, షేక్ మీరావలి, దాసరి లక్ష్మీదుర్గ, ముప్పవరపు భారతి తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, కాకుమాను రాజేష్

ఘనంగా షిరిడి సాయి బృందావనం వార్షికోత్సవం

ప్రజాశక్తి - గుంటూరు

స్థానికి షిరిడిసాయి బృందావనం సంస్థ 11వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ హాజరై కక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. కన్నా మాట్లాడుతున్న షిరిడిసాయి బృందానం తక్కువ ధరకే ప్లాట్లు అందిస్తూ ఎంతో మంది ఇంటి కలను నిజం చేసిందన్నారు. చైర్మన్ కాకుమాను కృష్ణ మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా ఎంతో నమ్మకంతో మమ్మల్ని ఆదరించిన కస్టమర్లకు, మార్కెటింగ్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ కాకుమాను రాజేష్, మేనేజర్లు, మార్కెటింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.